

జిల్లా ప్రభుత్వాసుపత్రిలో యువకుల హల్‌చల్ 7
పేదలకు రూ.5 లక్షల విలువైన వైద్యం : ఎంపీ

మళ్లీ 'నామినేటెడ్' సందడి

- ఉమ్మడి 'తూర్పు' జిల్లాలో నాలుగు మార్కెట్ కమిటీలకు చైర్మన్ల ప్రకటన
- నాలుగు ఏఎంసీలూ టీడీపీకి కేటాయింపు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మరోసారి నామినేటెడ్ పదవుల సందడి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం పలు మార్కెట్ కమిటీలకు చైర్మన్లను ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 30 ఏఎంసీ చైర్మన్ల జాబితాను బుధవారం విడుదల చేయగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నలుగురిని నియమించారు. నాలుగు మార్కెట్ కమిటీలను టీడీపీకి కేటాయించారు. కాకినాడ జిల్లాలోని కాకినాడ అర్బన్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బచ్చు శేఖర్, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మార్ని వాసుదేవ్, కొవ్వూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నాదెళ్ల శ్రీరామ్ చౌదరి,డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అయినవిల్లి టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్‌ను నియమించారు.

22 నుంచి డెల్టా కాలువలు మూసివేత

- ఇరిగేషన్ మంత్రి ఆదేశాలతో మూసివేత గడువు పెంపు

ధవళేశ్వరం,ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): డెల్టా కాలువలు ఈనెల 22 నుంచి మూసివేయనున్నారు. రబీ అనంతరం ఖరీఫ్‌లో సాగునీరు సక్రమంగా పారేందుకు డెల్టా కాలవల షెట్టర్లు, లాకులు వంటి మరమ్మతులు(క్లోజర్ పనులు) చేపట్టడానికి కాల్వలకు నీటి విడుదల నిలిపివేస్తారు.డెల్టా కాలువలు ఈనెల 16వ తేదీనే మూసివేసేందుకు సిద్ధంకాగా గ్రామాల్లో తాగునీటి చెరువులు నింపుకోవడం, ఇతరత్రా అవసరాల నిమిత్తం ఈ నెల 22 వరకు నీటిని విడుదల గడువు పెంచారు. ఇరిగేషన్ మంత్రి ఆదేశాలతో కాల్వల మూసివేతను 22వ తేదీ వరకు వాయిదా వేశారు. బుధవారం కాటన్‌బ్యారేజ్ నుంచి తూర్పుడెల్టాకు 1200 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1100 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 3 వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరంవద్ద నీటిమట్టం 9.30 అడుగులుగా నమోదైంది.

రబీని గట్టెక్కించిన సీలేరు జలాలు

తూర్పు,మధ్య, పశ్చిమ డెల్టాలోని 8.96 లక్షల ఎకరాలకు రబీలో సాగునీటిని సమృద్ధిగా అందించారు. డిసెంబర్ నుంచి నేటి వరకు మూడు డెల్టా కాలువలకు 114.644 టీఎంసీల నీటిని కాటన్ బ్యారేజ్ నుంచి విడుదల చేశారు. సీలేరు నుంచి పవర్ జనరేషన్‌ద్వారా 44.084 టీఎంసీలు గోదావరికి విడుదల కాగా బైపాస్ మార్గం ద్వారా నేరుగా 17.781టీఎంసీలు విడుదల చేశారు. సీలేరు నుంచి మొత్తం 61.865 టీఎంసీలు గోదావరికి విడుదలయ్యాయి.పోలవరం వద్ద 16 టీఎంసీల నీటి నిల్వలు ఉంటాయని అధికారులు లెక్కకట్టగా రబీ సీజన్‌లో గోదావరిలో సహజ జలాల లభ్యత 36 టీఎంసీలకు పైగా ఉంది. గత రబీసీజన్‌లో అప్పటి వైసీపీ ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్ర సాగునీటి ఎద్దడి నెలకొన్నారు. అప్పట్లో మార్చి నెలాఖరు నాటికి ధవళేశ్వరంవద్ద గోదావరి నీటిమట్టం 5.50 అడుగులకు పడిపోయింది. పాండ్‌లో నీరు డెల్టా కాలువలకు ప్రవహించని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం నాయకులు,అధికారుల సమన్వయంతో రబీకి సమృద్ధిగా సాగునీరందించారు.



ప్లస్ కాదు.. మైనస్!

- ప్లస్ 2 ఇంటర్‌తో అవస్థ
- హైస్కూళ్లలో సౌకర్యాలు కరువు
- సున్నా ఫలితాలు..దిగజారిన ఉత్తీర్ణత
- విద్యార్థుల భవితతో చెలగాటం
- జగన్ అనాలోచిత నిర్ణయం ఫలితం
- గతేడాది పాస్ శాతం అంతంతే
- ఏడాదైనా మారని తీరు..
- సర్కారు దృష్టి పెట్టాల్సిందే..

ఇంటర్ అంటే విద్యార్థి భవిష్యత్.. అక్కడ వేసిన అడుగే ముందుకు నడిపిస్తుంది.. ఇంజనీరింగ్.. మెడిసిన్.. ఐఐటీ..జేఈఈ వంటి ఉన్నత చదువులకు పునాది ఇక్కడే.. అటువంటి పునాదికి జగన్ మంగళం పాడేశారు. రెండేళ్ల కిందట వైసీపీ ప్రభుత్వ హయాంలో హైస్కూల్స్‌లో 'ప్లస్' అంటూ ఉన్నత పాఠశాలల్లో ఆర్భాటంగా ఇంటర్మీడియట్ కోర్సులను ప్రారంభించారు.విద్యార్థుల బోధన అంశాన్ని గాలికొదిలేశారు. దీంతో హైస్కూల్ ప్లస్‌లు విద్యార్థుల జీవితాలను మైనస్‌లో పడేస్తున్నాయి. ఈ ఏడాది కొన్ని పాఠశాలల్లో ఒక్కరూ పాస్ కాలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత ప్రభుత్వం దీనిపై పునరాలోచించాలి.

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

హైస్కూల్ ప్లస్ అనేది రెంటికీ చెడ్డ రేవడిగా తయారైంది.పాఠశాల విద్యాశాఖ పదో తరగతి వరకూ దృష్టి సారిస్తోంది. జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఇంటర్ బోర్డు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. కానీ హైస్కూల్ ప్లస్ మాత్రం ఎటు కాకుండా పోతోంది. దీంతో విద్యార్థుల చదువు చతికిలబడుతోంది.గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 'హైస్కూలు ప్లస్' పేరుతో ఏర్పాటు చేసిన ఇంటర్‌కు రెండేళ్లలో పరీక్షలకు హాజరైన విద్యార్థుల ఉత్తీర్ణత గణనీయంగా పడిపోయింది.కొన్ని స్కూళ్లలో అయితే సున్నా ఫలితాలు వచ్చాయి.హైస్కూలు ప్లస్‌లో సరైన మౌళిక సదుపాయాలు, నిపుణులైన అధ్యాపకులు లేకపోవడంతో విద్యార్థుల భవిత పూర్తిగా అంధకారమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ విద్యార్థులకు హైస్కూలు ఉపాధ్యాయులతోనే విద్యాబోధనను మమ అనిపించారు.దాంతో ఆ హైస్కూలు ప్లస్‌లో చదివిన విద్యార్థులు ఉత్తీర్ణత శాతం గణనీయంగా పడిపోయింది.

ఇంటర్ ఫలితాల్లో వెనుకబడింది!



14 కేంద్రాల్లో.. ఫలితం సున్నా..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో ప్రథమ సంవత్సరానికి చెందిన హైస్కూలు ప్లస్ విద్యార్థులు 300 మంది పరీక్షలకు హాజరైతే వారిలో 81 మంది అంటే 27.5 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. 219 మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరంలో ఫెయిలయ్యారు. ఇక ద్వితీయ సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 224 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైతే వారిలో 112 మంది అంటే 50 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కోనసీమ జిల్లా అంతర్వేదిపాలెం, కందికుప్ప, ర్యాలి, పి.గన్నవరం, ఐ.పోలవరం, గొల్లవిల్లి, ముంగండ, జి.వేమవరం పాఠశాలల్లో ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్‌లో సున్నా ఫలితాలు నమోదయ్యాయి. ద్వితీయ సంవత్సరం అంతర్వేదిపాలెంలో సున్నా ఫలితాలు వెలువడ్డాయి. తూర్పు గోదావరి జిల్లాలో ప్రథమ సంవత్సరంలో సింగంపల్లి,సత్యవాడ,పోతవరం, పెరవలి కేంద్రాల్లో, ద్వితీయ సంవత్సరం అనపర్తిలో సున్నా ఫలితాలు నమోదయ్యాయి.

ఏ జిల్లా చూసినా ఇదే తీరు..

తూర్పుగోదావరి జిల్లాలో 22 ఉన్నత పాఠశాలల్లో 'హైస్కూల్ ప్లస్' అనే పేరుతో ఇంటర్మీడియట్ మొదటి ఏడాది కోర్సులను ప్రారంభించారు. తర్వాత రెండో ఏడాది 14 స్కూళ్లలో అందుబాటులోకి తెచ్చారు. అయితే లెక్చరర్ల నియామకం, ప్రయోగశాలలు, మౌళిక సదుపాయాల ఏర్పాటును పట్టించుకోలేదు. సరైన తరగతి గదులు లేవు. హైస్కూల్ ఉపాధ్యాయులతోనే ఆయా సబ్జెక్టుల్లో పీజీ చేసిన వారితో ఈ విద్యార్థులకు పాఠాలు చెప్పిస్తున్నారు. ఆ ఉపాధ్యాయులు వారి రెగ్యులర్ తరగతులు చూసుకొని ఇంటర్ విద్యార్థులకు చెప్పాల్సి వస్తోంది. కొన్ని స్కూల్స్‌లో పరీక్షలు దగ్గరకు వచ్చినా కోర్సులో ఏ పుస్తకాలు ఉంటాయి, వాటిలో ఏమి పాఠాలు ఉంటాయనేవి కూడా చాలా మంది విద్యార్థులకు అవగాహన లేకుండా ఉంటుందంటే హైస్కూల్ ప్లస్ విద్యార్థుల దుస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

స్కూలా.. కాలేజీనా?

ఒకటి నుంచి ఐదు వరకూ ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం జరుగుతుంది. వాళ్లు ఆరు నుంచి ఉన్నత పాఠశాల (హైస్కూల్)కి వెళతారు. దీంతో హైస్కూల్ విద్యార్థులమనే ఒక రకమైన ఆనంద భావనతో పిల్లలుంటారు. తర్వాత ఇంటర్మీడియట్ కోసం కళాశాల(జూనియర్ కాలేజీ)లో చేరతారు. అప్పటి వరకూ స్కూల్ పిల్లలమనే భావన నుంచి కాలేజీకొచ్చామంటూ కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టినట్టు ఫీలవుతారు. అక్కడ మాస్టారు.. ఇక్కడ లెక్చరర్‌గా విద్యను బోధిస్తారు. ఇదంతా పిల్లల మానసిక పరిపక్వత, ఆలోచన సామర్థ్యం, సృజనాత్మకత పెంపుదలకు దోహదపడుతుందని విద్యానిపుణులు చెబుతున్నారు. కానీ హైస్కూల్ ప్లస్ పేరుతో పిల్లలను అక్కడే ఉంచేసి వాళ్లలో గందగోళాన్ని నిం పారు.ఆ ప్రభావం చదువుపై పడే అవకా శం లేకపోలేదని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కార్తీక్ విశ్లేషించారు.జూనియర్ కళాశాలల మాదిరిగా లెక్చరర్లు,మౌలిక సదుపాయాలు, ప్రయోగ శాల లను అందుబాటులోకి తెస్తే పరిస్థితి మారవచ్చు.

ఈ ఏడాది ఫలితాలివీ

తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఈ ఏడాది ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో హైస్కూల్ ప్లస్ పాఠశాలలు కొన్ని చాలా దారుణమైన ఫలితాలను నమోదు చేశాయి. ఐదు పాఠశాలల్లో మొదటి ఏడాది, ఒక పాఠశాలలో రెండో ఏడాది ఒక్కరూ పాస్ కాలేదు. మొదటి ఏడాది రోల్ 483 ఉంటే 454 మంది పరీక్షలకు హాజరయ్యారు. దీంట్లో కేవలం 182 మంది మాత్రమే గట్టెక్కారు. రెండో ఏడాది 283కి 269 మంది పరీక్షలు రాయగా 160 మంది ఉత్తీర్ణత సాధించారు. అయితే గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ఉత్తీర్ణత కాస్త మెరుగుపడడం గమనార్హం.

తూర్పుగోదావరి జిల్లాలో ఫలితాలు ఇలా

హైస్కూల్ ప్లస్ కేంద్రం	ప్రథమ హాజరు	ఉత్తీర్ణత	ద్వితీయ హాజరు	ఉత్తీర్ణత
1.రాజమండ్రి సిటీ	29	8	0	0
2.బిక్కవోలు	16	1	0	0
3.అనపర్తి	41	8	6	0
4.పాతతుంగపాడు	19	2	0	0
5.రాజమండ్రిరూరల్	43	26	43	30
6.రాజానగరం	38	21	24	20
7.సింగంపల్లి	8	0	7	4
8.వెదుళ్లపల్లె	32	17	13	6
9.కుతుకులూరు	11	1	0	0
10.పందలపాక	23	3	13	8
11.కామరాజుపేట	36	14	22	14
12.కడియం	29	9	35	14
13.గాడాల	21	8	23	14
14.సత్యవాడ	2	0	0	0
15.ఖండవల్లి	0	0	0	0
16. పోతవరం	12	0	0	0
17.ఉండ్రాజవరం	7	3	12	7
18.చాగల్లు	18	4	14	9
19.దేవరపల్లి	11	7	16	8
20.నల్లజర్ల	39	17	25	19
21.పెరవలి	4	0	0	0
22.అన్నదేవరపేట	15	7	16	7
	454	182	269	160

దేవీపట్నంలో హాజరు 41.. పాస్ జీరో!

(రంపచోడవరం/రాజవొమ్మంగి-ఆంధ్రజ్యోతి) : అల్లూరి జిల్లా రంపచోడవరం మన్యంలో మూడు చోట్ల ఉన్నత పాఠశాలల్లో ప్లస్ టు జూనియర్ కళాశాలలు నడుస్తున్నాయి. రాజవొమ్మంగి జిల్లా పరిషత్ జూనియర్ కళాశాల, అడ్డతీగల జిల్లా పరిషత్ జూనియర్ కళాశాల, దామనపల్లి గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ప్లస్ టు కళాశాలలకు సంబంధించి ప్రథమ సంవత్సరంలో అడ్డతీగల, దేవీపట్నంలో జీరో ఫలితాలు వచ్చాయి. దేవీపట్నంలో మొదటి ఏడాదిలో 41 మంది పరీక్షలు రాయగా ఒక్కరూ పాస్ కాలేదు. రాజవొమ్మంగిలో గత రెండేళ్ల నుంచి మొదటి సంవత్సరంలో ఏ ఒక్కరూ పాస్ కాకపోగా, ఈ ఏడాది ముగ్గురు విద్యార్థులు మాత్రమే పాసయ్యారు.

కందుకూరికి ఘన నివాళి



కందుకూరి వీరేశలింగం చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని ఎంపీ పురందేశ్వరి అన్నారు. ఆయన 177వ జయంతిని పురస్కరించుకుని రాజమహేంద్రవరం ఆనంద్ గార్డెన్స్‌లో సమాధి వద్ద బుధవారం నివాళులర్పించారు. శిథిలావస్థలో ఉన్న కందుకూరి వీరేశలింగం ఇంటి మరమ్మతులకు రూ.35 లక్షలు ఇస్తానన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. - వివరాలు 8లో

నెలవారీ లక్ష్యాలు పూర్తి చేయండి : కలెక్టర్



సచివాలయ సందర్శనలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సమస్య ఏదైనా ముందుగా తెలుసుకుంటేనే పరిష్కారం చూపడం కూడా సాధ్యమౌతుందని కలెక్టర్ పి ప్రశాంతి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అన్ని ప్రభుత్వ శాఖ అధికారులతో బుధవారం 2025-26 వార్షిక ప్రణాళికపై సమన్వయ శాఖల సమావేశం నిర్వహించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో సీజనల్ టార్గెట్స్, హౌసింగ్ ,జిల్లా గ్రామీణాభివృద్ధి తదితర శాఖల నెలవారీ పురోగతి మేరకు లక్ష్యాలను సాధించేందుకు సరైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. మైన్స్ ఆధ్వర్యంలో నెలకు 24 వేల మెట్రిక్ టన్నులు, వర్షాకాలం కోసం 18 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి తేవడంపై దృష్టిసారించాలన్నారు. ప్రజాప్రతినిధులతో కలిపి ఈనెల 21 న స్కూల్స్ సందర్శన చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జేసీ చిన్నరాముడు, డీఆర్వో సీతారామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో జవాబుదారీతనం ఉండాలి

దివాన్‌చెరువు, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ సిబ్బంది జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. దివాన్‌చెరువులోని గ్రామ సచివాలయం -2ను బుధవారం సందర్శించారు. సచివాలయం పరిధిలో శానిటేషన్ నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. ప్రజా సేవకు రాష్ట్రప్రభుత్వం మన మిత్ర యాప్ వాట్సప్ గవర్నెన్స్ తీసుకువచ్చిందని తెలిపారు. తొలిదశలో 161 పౌరసేవలు యాప్ ద్వారా అందజేయనున్నామన్నారు. సచివాలయం పరిధిలో ఉన్న అన్ని కుటుంబాలకు చెందిన వారి ఫోన్లలో ఈ నెంబరు ఫీడ్ చేయాలన్నారు. ఆమె వెంట ఇన్‌చార్జి డీఎల్‌పీవో పి.వీణాదేవి, రాజానగరం తహశీల్దార్ జీఎల్‌ఎస్ దేవి, ఎంపీడీవో జెపయూన్సీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పక్కా.. కమర్షియల్!

ధవళేశ్వరం పంచాయతీ వద్ద భవనం



రెసిడెన్షియల్ మాటున కమర్షియల్ నిర్మాణాలు

- ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు
- అధికారులు మామూళ్ల మత్తు
- యథేచ్ఛగా సహకరిస్తున్న వైనం
- కళ్లెదుటే ఉన్నా కనిపించదు
- పెరుగుతున్న అక్రమ భవనాలు
- నిబంధనలు హుష్ కాకి
- నోటీసులతో సరి

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : అంతా మా ఇష్టం.. అడిగేదెవడురా అంతా మా ఇష్టం.. అనుకున్నారో ఏమో కానీ.. గత ప్రభుత్వ హయాంలో నిబంధనలు అతిక్రమించి బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టారు. అయినా అధికారులు నేటికీ చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. ప్రభుత్వం మారినా అధికారుల తీరు మారకపోవడంపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మామూళ్ల మత్తులో అక్రమ నిర్మాణాలకు కొమ్ము కాస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆక్రమించేసి.. కట్టేసి

కాదేది ఆక్రమణలకు అనర్హం అన్నట్టు ఉంది పరిస్థితి. రోడ్లు, కాలువలు, ఇరిగేషన్ స్థలాలు, దేవాదాయ శాఖ, ఏపీఐఐసీ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా తూతూ మంత్రంగా నోటీసులిచ్చి చేతులు దు లుపుకుంటున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఒక వైపు జిల్లా కలెక్టర్.. మరో వైపు నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై చర్యలు చేపట్టాలంటూ ఆదేశాలు జారీచేసినా పంచాయతీ రాజ్ అధికారులు తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తుండడంతో అక్రమ నిర్మాణదారులకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. రాజమహేంద్రవరం రూరల్ మండల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో రెసిడెన్షియల్ నిర్మాణాలకు ప్లాన్ తీసుకొని కమర్షియల్ భవన నిర్మాణాలు చేపడుతున్నా అధికారుల మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంతో ప్రభుత్వానికి రావాల్సిన లక్షలాది రూపాయలు గండిపడుతుంది. ఈ తతంగంలో అధికారులు, కొంత మంది స్థానిక నాయకుల జేబులు నిండుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరువలో ఇలాంటి అక్రమాలు బోలెడు ఉన్నాయి. ధవళేశ్వరం పంచాయతీ ఎదురుగా రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని ఏకంగా ఫంక్షన్ హాల్ నిర్వహిస్తున్నారు. అదే గ్రామం కొత్తపేట ప్రాంతంలో నల్లా కాలువ ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపట్టినా నోటీసులిచ్చి చేతులు దులుపుకున్నారు. బొమ్మూరు పంచాయతీ పరిధి బాలాజీపేట సెంటరులో రెసిడెన్షియల్ అనుమతులు తీసుకుని సెమీ రెసిడెన్షియల్ భవన నిర్మాణం చేపట్టి ఒక బ్యాంక్‌కు అద్దెకు ఇచ్చారు. పిడింగొయ్యి పంచాయతీ పరిధి జగదీశ్వరీ లేఅవుట్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెనుక ప్రాంతంలో రెసిడెన్షియల్ అనుమతులు తీసుకుని కళ్యాణమండపం నిర్మించారు. హుకుంపేట పంచాయతీ రామకృష్ణ నగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఫ్లోర్‌ను కూల్చివేయాలంటూ లోకాయుక్త నుంచి ఆదేశాలు వచ్చినా అధికారులు మాత్రం భవన యజయానితో కుమ్మక్కై నాన్చుతున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే అక్రమ నిర్మాణాలు అటు రాజమహేంద్రవరం నగరం.. ఇటు రూరల్‌లో బోలెడు.. రూరల్ మండలం పరిధిలోని వెంకటనగరం,కాతేరు, కోలమూరు, శాటి లైట్ సిటీ, రాజవోలు, తదితర ప్రాంతాలతో పాటు రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో చాలా అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. దీనిపై పంచాయతీ కార్యదర్శులను ప్రశ్నిస్తే నోటీసులిచ్చాం మా పనైపోయిందన్నట్టు చెబుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి అక్రమ భవన నిర్మాణదారులపై చర్యలు చేపట్టాలని పలువురు మాజీ ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.



సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

బలభద్రపురంలో ఆరోగ్య సర్వే

బిక్కవోలు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): బలభద్రపురం గ్రామంలో 8 బృందాలతో ఎన్‌సీడీ సీడీ 3.0 సర్వే నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌వో డా. కె.వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు.ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సర్వేలో భాగంగా 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి డేటాను నిక్షిప్తం చేస్తున్నట్టు తెలిపారు. ఆరోగ్య పరీక్షల్లో భాగంగా బీపీ, మధుమేహం, రక్తహీనత, రొమ్ము క్యాన్సర్, సర్వేకల్ క్యాన్సర్, నోటి క్యాన్సర్ పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు.క్యాన్సర్ సంబంధిత లక్షణాలు గుర్తిస్తే వెంటనే వారిని స్పెషలిస్ట్ డాక్టర్లకు రిఫర్ చేసి తగిన వైద్య పరీక్షలు చేయించి మందులు అందించడం జరుగుతుందన్నారు. గ్రామంలో ఉన్న పది వేల జనాభాను సర్వే చేస్తామన్నారు.

నిబంధనల ట్రాక్ తప్పారు!



రైలు కోచ్ రెస్టారెంట్

ప్రమాదాలు చెప్పిరావు.. ఏ క్షణానికి ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు.. ఎవరి జాగ్రత్తలో వాళ్లుండాల్సిందే.. లేదంటే ప్రమాదం తప్పదు.. రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషను ప్రాంగణంలోని రైల్ కోచ్ రెస్టారెంట్ నిబంధనల ట్రాక్ తప్పుతూనే ఉంది. అధికారులు అటుగా చూడకపోవడంతో ఉల్లంఘనలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. కాంట్రాక్టర్లకు వ్యాపారంపై ఉన్న యావ భద్రతపై ఉండడం లేదు. ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న వాటిపై కూడా అధికారులు పట్టించుకోవడంలేదు. రైల్ కోచ్ రెస్టారెంట్‌లో అగ్ని మాపక పరికరాలు లేవు. రైలు బోగీకి రంగులు వేసి, లోపల ఫైవుడ్, కుషన్ సీట్లు ఏర్పాటు చేశారు. ఇవన్నీ అగ్గికి ఆజ్యం వంటివే. ఒక్కసారి నిప్పు రేగితే వేగంగా బుగ్గి అయిపోతాయి. పైగా తప్పించుకొనే (ఎస్కేపింగ్ వే) మార్గాలను సూచించలేదు. ఒక ఫైర్ ఎస్టింగిషర్ (మంటలు ఆర్పే గ్యాస్ ఉన్న చిన్న సిలిండర్)ని జనాలను ఏమార్చడానికి కోచ్ బయట పడేశారు. అది కూడా ఎప్పుడో కాలం చెల్లిపోయింది. రెస్టారెంట్‌లో వంటలకు గృహ వినియోగ సిలిండర్లను వాడుతున్నారు. ఇది చట్ట రీత్యా నేరం. పైగా దానిని వేడి నీటిలో పెట్టి మరీ వినియోగిస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. ఏదైనా ప్రమాదం జరిగితేనే కానీ పట్టదా సార్.. ఒకసారి అటు చూడండి మరి.. - రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి



రెస్టారెంట్ లోపల ఇలా..



గృహ సిలిండర్ వినియోగం

వివాహ వేడుకకు వెళ్లి వస్తుండగా విషాదం



వెంకటనగరం వద్ద మృతిచెందిన వీరబాబు (ఫైల్‌ఫొటో)

- బైక్‌ను లారీ ఢీకొనడంతో యువకుడి మృతి
- మరో యువకుడికి గాయాలు
- న్యాయం చేయాలంటూ మృతుడి కుటుంబీకుల ఆందోళన



ప్రత్తిపాడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం వెంకటనగరం వద్ద బుధవారం సాయంత్రం బోర్‌వెల్ లారీ మోటార్‌బైక్‌ను ఢీ కొన్న ఘటనలో యువకుడు మృతిచెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు అందించిన మేరకు... ప్రత్తిపాడు మండలంలోని చింతలూరు గ్రామానికి నందవరపు వీరబాబు(20), నందవరపు కృష్ణలు బుధవారం మోటార్ బైక్‌పై శంఖవరం మండలం కొత్తూరు గ్రామం వెళ్లారు. అక్కడ వివాహ వేడుకలో పాల్గొని సాయంత్రం 3.30గంటల సమయంలో స్వగ్రామం చింతూరుకు బైక్‌పై బయల్దేరారు. వెంకటనగరం గ్రామ సమీపంలోని చెరువు వద్ద కోళ్లఫారం వద్దకు చేరుకోగానే ఎదురుగా చింతలూరు నుంచి కత్తిపూడి వైపు వెళ్తున్న బోర్‌వెల్స్ లారీ ఢీ కొంది. ఈ ఘటనలో వీరబాబు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన కృష్ణను అంబులెన్స్‌లో ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. వీరబాబు చింతలూరు గ్రామానికి నందవరపు రాము దంపతుల రెండో కుమారుడు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. పెదనాన్న నందవరపు బైరాగి కుమారుడైన కృష్ణతో మోటార్‌బైక్‌పై కొత్తూరుకు వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడంతో చింతలూరులో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. అందివచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరయ్యారు. మృతుల కుటుంబీకులు, గ్రామస్థులు ఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కడుపునొప్పని వెళ్తే ప్రాణంపోయింది!

వ్యక్తి మృతిపై బంధువుల ఆందోళన

వైద్యులు, సిబ్బందే కారణమని యానాం ప్రభుత్వాసుపత్రి వద్ద బైఠాయింపు



యానాంలో ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు



మరణించిన శ్రీనివాస్ (ఫైల్)



శ్రీనివాస్ కొడుకు, కుమార్తె

యానాం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో అయ్యన్ననగర్‌కు చెందిన పొన్నాడ శ్రీనివాస్ (32) మృతికి యానాం ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బందే కారణమని బంధువులు ఆందోళనకు దిగారు. మంగళవారం రాత్రి శ్రీనివాస్‌కు కడుపునొప్పి రావడంతో యానాం ప్రభుత్వాసుపత్రికి వచ్చాడు. వైద్యులు పరీక్షించి మందులు ఇవ్వడంతో ఇంటికి వెళ్లిపోయాడు. అనంతరం అర్ధరాత్రి నొప్పి తీవ్రంగా రావడంతో ఆసుపత్రికి రాగా మళ్లీ చికిత్స అందించారు. అనంతరం కాకినాడకు రిఫర్ చేయాలని వైద్యులు సూచించినా అంబులెన్సు సిబ్బంది సరైన సమయానికి అంబులెన్స్ రాకపోవడం, రోగి కూడా నర్సుకుడా రాకపోవడం తదితర కారణాలతో శ్రీనివాస్ మార్గమధ్యలో మృతిచెందినట్టు బంధువులు ఆరోపించారు. అనంతరం మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉంచారు. శ్రీనివాస్ మృతికి యానాం ఆసుపత్రి సిబ్బందే కారణమని శ్రీనివాస్ కుమార్తె జోశ్న (5), కుమారుడు వీరాట్ (3)తో కలిసి బంధువులు ఆసుపత్రి వద్ద బైఠాయించారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో మత్స్యకార సంఘ నాయకులు మల్లాడి శామ్యూల్, శేరు కృష్ణా తదితరులు ఆసుపత్రి వద్దకు వచ్చి ఆందోళనకారులు, ఆసుపత్రి డీడీతో మాట్లాడారు. త్రిమెన్ కమిటీ వేసి విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీడీ తెలపడంతో ఆందోళన విరమించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. శ్రీనివాస్ మృతిపై అతడి భార్య శివగంగ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ ఘటనలో...

నిందితుడి అరెస్టు

అన్నవరం/శంఖవరం ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పులదండ వేసిన ఘటనలో నిందితుడిని అరెస్టు చేసినట్టు అన్నవరం ఎస్‌ఐ హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో నలుగురు సీఐలు, 10మంది ఎస్‌ఐలు, 40మంది సిబ్బంది కేసును చేధించేందుకు టీంగా ఏర్పడ్డారు. నిందితుడైన శంఖవరానికి చెందిన పడాల వాసు (20)ను అరెస్టు చేశారు. వాసు దుందుడుకు స్వభావం కలవాడు. కొద్దిరోజులక్రితం ఎస్సీకాలనీలో కొంతమందితో తోపులాటలు జరగగా పెద్దలు రాజీకుదిర్చారు. అది వాసుకు నచ్చకపోవడంతో అంబేడ్కర్ జయంతిరోజున వివాదం సృష్టించాలని ప్రయత్నించి పోలీస్ బందోబస్తు అధికంగా ఉండడంతో వీలు పడలేదని, అర్ధరాత్రి దాటిన తరువాత పథకం ప్రకారం పాతరబ్బరు చెప్పు, ఇంట్లో ఉన్న తాడుతో దండగా కట్టి విగ్రహంపై వేశాడు అని ఎస్‌ఐ పేర్కొన్నారు. దీనిపై మరింత లోతుగా విచారణ జరుపుతున్నామని చెప్పారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

తుని రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న యువకుడు బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనకాపల్లి జిల్లా పెంటకోట గ్రామానికి చెందిన కర్రి లక్ష్మణ్ తుని డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల బయట పురుగుల మందు తాగడం గమనించిన తోటి విద్యార్థులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఏరియా ఆసుపత్రికి చేరుకుని ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలుసుకునే ప్రయత్నం చేసినట్టు ఎస్‌ఐ కృష్ణమాచార్యులు తెలిపారు. సకాలంలో ఆసుపత్రికి తరలించడంతో విద్యార్థి కోలుకుంటున్నట్టు వైద్యులు తెలిపారు.



చికిత్స పొందుతున్న లక్ష్మణ్

భూగర్భ జలాలు పెంచే యజ్ఞం!

- నీటి కుంటల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు
- ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు
- జూన్ నెలాఖరు నాటికి పూర్తిచేయడమే లక్ష్యం



కోటనందూరు మండలం ఎస్‌ఆర్‌పేటలో నీటికుంట ఏర్పాటు చేస్తున్న దృశ్యం(ఫైల్)

కోటనందూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాల పెంపుతో సాగు, తాగునీటి సమస్యను తీర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం యజ్ఞంలా ఫారం పాండ్స్ (నీటి కుంటలు) ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. భూమిలో తేమశాతం సంరక్షించాలన్నే లక్ష్యంతో తవ్వకాలు చేపట్టింది. ప్రతి పంచాయతీలో పదికి తగ్గకుండా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉండడంతో వీటికి నిధులు విడుదల చేయడం తో పాటు పనులు వేగవంతంగా జరగాలని ఆదేశాలు ఇచ్చారు. ఇటీవల ఆయన ప్రారంభోత్సవ కార్యక్రమం కూడా చేపట్టారు. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నీటికుంటల పనులు ఊపందుకున్నాయి. రాష్ట్రంలో లక్షా 55 వేలు నీటి కుంటల ఏర్పాటు లక్ష్యంగా నిర్ణయించారు. అలాగే జిల్లాలో కూడా వీటి ఏర్పాటుకు ఒక నిర్దిష్టం సంఖ్య ఏర్పాటు చేసి ఉపాధి నిధులతో పనులు చేపడుతున్నారు. జూన్ నెలాఖరు నాటికి పనులు పూర్తిచేయాలని ఆదేశాలు ఉండడంతో అందుకనుగుణంగా పనులు జరుగుతున్నాయి.

ఉపయోగాలివే...

రైతుల పొలంలో నీటికుంటలు తవ్వకాలు చేయడం వల్ల భూగర్భ జలాలు పెంచడంతో పాటు, భూమిలో తేమ శాతం, పశువులకు తాగు నీరు, పంటలకు పురుగు మందుల పిచికారీకి నీరు, అందుబాటులో ఉంటుంది. బోరు బావి దగ్గర్లో ఏర్పాటు చేస్తే నీటి శాతం పెరుగుతోంది. దీంతో రైతులను చైతన్యపరిచి నీటికుంటలు ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపడుతున్నా రు. నీటకుంటలు సైజు ఆధారంగా రేట్లు ఉంటా యి. తక్కువ ఖర్చుతో ప్రయోజనకరంగా ఉండేందుకు వీలుగా పొలాల్లో 8 మీటర్లు వెడల్పు, 8మీటర్లు పొడవుకు 2మీటర్లు లోతుకు 128 చదరపు మీటర్లు నీటికుంటకు రూ.38,400 ఉపాధి నిధులను ఖర్చు అవతుంది. అలాగే పలు రకాలుగా పొడవు, వెడల్పుతో నీటికుంటలు ఏర్పాటు చేస్తున్నారు.

అన్నదాతలకు అవగాహన

నీటి కుంటల ఏర్పాటుపై అన్నదాతలకు అధికారులకు అవగాహన కల్పించి తద్వారా ఏర్పాటుకు ముమ్మరంగా పనిచేస్తున్నారు. గత ప్రభుత్వం వైసీపీ వీటిని నిర్లక్ష్యం చేయగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నీటి కుంటల ఏర్పాట్లు ముందుకు సాగుతున్నాయి. సాగునీటి వనరులు పెంచే లక్ష్యంతో అధికారులు అడుగులువేస్తున్నారు. దీనిలో భాగంగా కాకినాడ జిల్లాలో 2500 నీటి కుంటల ఏర్పాటు లక్ష్యం కాగా అందులో రూ.25 కోట్లతో పనులు చేపడుతున్నారు. అలాగే తూర్పు గోదావరి జిల్లాలో 1500 నీటికుంటల ఏర్పాటు లక్ష్యం కాగా... రూ.4.50కోట్లు నిధులు ఇచ్చారు. ఇప్పటి వరకూ 1166 గుర్తించగా అందులో 138 పూర్తిచేశారు. ఒక్కోటి అంచనా వ్యయం రూ.25 వేల నుంచి 35వేలు అని చెప్పవచ్చు. అనుకున్న లక్ష్యం ప్రకారం మొత్తం జూన్ నెలఖారు నాటికి నీటి కుంటలు పూర్తి చేసేలా పనులు జరుగుతున్నాయి.

రైతులు ఉపయోగించుకోవాలి

నీటికుంటల ఏర్పాటుకు ప్రాధాన్యమిస్తున్నాం. కాకినాడ జిల్లాలో 2500 నీటికుంటలు ఏర్పాటుచేసి జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేసి రైతులకు ప్రయోజనకరంగా ఉండేలా చేస్తున్నామన్నారు. ప్రతి రైతు ఉపయోగించుకోవాలి.

-అడపా వెంకటలక్ష్మి, పీడీ, ఉపాధి హామీ పథకం, కాకినాడ

రెండో రోజూ...

- కాకినాడలో కొనసాగిన ఏపీఎస్పీ రేంజ్ 1 క్రీడాపోటీలు
- నేడు ముగింపు కార్యక్రమం
- అతిథులుగా బెటాలియన్స్ ఐజీపీ రాజకుమారి, డీఐజీ ఫకీరప్ప



పరుగు పందెం



కబడ్డీ పోటీ



హైజంప్

కాకినాడ రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట గ్రా మ పంచాయితీ పరిధిలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ మైదానంలో నిర్వహిస్తున్న ఏపీఎస్పీ రేంజ్ 1 గేమ్స్, క్రీడాపోటీలు రెండో రోజు బుధవారం కొనసాగాయి. ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.నాగేంద్రరావు క్రీడా పోటీలను పరిశీలించారు. 3రోజుల పాటు జరిగే పోటీల్లో కాకినాడ 3వ బెటాలియన్‌తో పాటూ విజయనగరం నుంచి 5వ బెటాలియన్, మంగళగిరి నుంచి 6 బెటాలియన్, విశాఖపట్నం నుంచి 16 బెటాలియన్‌కు చెందిన పోలీస్ క్రీడాకారులు చెస్, క్రికెట్, కబడ్డీ, హైజంప్, 1500, 200, 5000 మీటర్లు పరుగు, మారథాన్ వంటి క్రీడల్లో పాల్గొన్నారు. గేమ్స్, క్రీడా పోటీలు గురువారం ముగియనుండగా ఈ కార్యక్రమంలో బెటాలియన్స్ ఐజీపీ బి.రాజకుమారి, డీఐజీ కె.ఫకీరప్ప ముఖ్య గౌరవ అతిథులుగా పాల్గొంటున్నారని 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.నాగేంద్రరావు తెలిపారు.

విజేతల వివరాలు

క్రీడాపోటీల్లో భాగంగా రెండో రోజు నిర్వహించిన హైజంప్ పోటీలో పి.ప్రసాదరావు, వి.సుధాకర్, జి.శ్రీను ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నిలిచారు. అదేవిధంగా 1500 మీటర్ల పరుగు పోటీలో ఎస్.సురేష్‌కుమార్, కె.రాజనాయుడు, పి.సత్యారావు మొదటి మూడు స్థానా లు కైవసం చేసుకున్నారు. 200 మీటర్ల పరుగులో ఎస్.సురేష్‌కుమార్, జి.శ్రీను, జి.మురళీ ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగాను, 5000 మీటర్ల పరుగులో ఎస్.సురేష్‌కుమార్, వై.సత్యారావు, రాజినాయుడు మొదటి 3 స్థానాల్లో నిలిచారు. మారథాన్‌లో ఎం.లక్ష్మణ్, టి.శ్రీనివాసరావు మొదటి, రెండు స్థానాల్లో, చదరంగంలో శివకుమార్, శ్రీను మొదటి, రెండు స్థానాలు గెలుపొందగా, కబడ్డీలో 16వ ఏపీఎస్పీ జట్టు విన్నర్‌గానూ, 5వ ఏపీఎస్పీ జట్టు రన్నర్‌గానూ నిలిచాయి. అలాగే క్రికెట్‌లో 3వ బెటాలియన్ ఏపీఎస్పీ జట్టు ప్రథమ, 6వ బెటాలియన్ ఏపీఎస్పీ జట్టు ద్వితీయ విజేతగా నిలిచాయి.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



సురేష్ (ఫైల్)

పిఠాపురం రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లాంలో బుధవారం సాయంత్రం విద్యుదాఘాతానికి గురైన వ్యక్తి మరణించాడు. గ్రామానికి చెందిన పల్లపు సురేష్‌బాబు(37) అదే గ్రామంలో ఓ ఇంటికి ఎలక్ట్రికల్ పనుల నిమిత్తం వెళ్లాడు. మోటార్‌కు కనెక్షన్ ఇస్తుండగా కరెంటు షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతడిని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు. అతడికి భార్య మణి, 10వతరగతి చదువుతున్న కుమారుడు సంజయ్, 8వ తరగతి చదువుతున్న కుమార్తె సరిత ఉన్నారు. విషయం తెలుసుకున్న సురేష్ కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని పిఠాపురం మార్చురీలో భద్రపరిచారు.

రోడ్డు ప్రమాదంలో మృతులకు ముగిసిన అంత్యక్రియలు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని జనగామ జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన సత్తి శ్రీను (50), సత్తి రమణకుమారి (45), సత్తి అనూష(22) అక్కడికక్కడే మృతిచెందారు. వారి మృతదేహాలకు జనగామ ఏరియా ఆసుపత్రిలో మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం బుధవారం ఉదయం వారి మృతదేహాలు స్వగ్రామం కోనసీమ జిల్లా అమలాపురం మండలం సవరప్పాలెం గ్రామానికి చేరుకోగా ఆ వెంటనే బంధువులు, స్నేహితుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అదే కుటుంబానికి చెందిన సత్తి రాజేశ్వరరావు, అనంతలక్ష్మి, సత్యఅరవింద్‌లు హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో ఇంకా చికిత్స పొందుతున్నారు.

బాలికపై అత్యాచారం

కాకినాడ క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం జరిగిన సంఘటన బుధవారం కాకినాడలో జరిగింది. నగరానికి ఓ మహిళ చేపలు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంది. ఆమెకు 16 ఏళ్ల కుమార్తె ఉంది. కాగా ఆమె భర్త కొంత కాలం క్రితం చనిపోవడంతో లోకేశ్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తుంది. ఈ క్రమంలో బుధవారం ఆ మహిళ బయటకు వెళ్లింది. ఆమె కుమార్తె ఇంటిలో ఉన్న సమయంలో లోకేశ్ ఇంటిలోకి వెళ్లి నిద్రిస్తున్న ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడి పరారయ్యాడు. ఇంటికి వచ్చిన తల్లితో ఆ బాలిక విషయాన్ని చెప్పింది. మహిళ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి బాలికను వైద్య పరీక్షలు నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 14 రోజుల రిమాండ్

రాయవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రాయవరానికి చెందిన బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన నిందితుడు తేతలి శ్రీనివాసరెడ్డిపై రాయవరం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. బుధవారం శ్రీనివాసరెడ్డిని అనపర్తి జేఎఫ్‌సీఎం ముందు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ డి.సురేష్‌బాబు తెలిపారు.

దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రజలకు రూ.5 లక్షల విలువైన వైద్యం

రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి



కడియపుసావరంలో మాట్లాడుతున్న పురందేశ్వరి

కడియం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రజలకు రూ.5 లక్షల విలువైన వైద్యం అందించేలా ఆయుష్మాన్‌భవ, ప్రతీ గ్రామానికి సురక్షితమైన తాగునీరు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో వాటర్‌ట్యాంకుల ఏర్పాటుతో పాటు ప్రతీ ఇంటికి కుళాయి ద్వారా నీరు అందించే విధంగా జలజీవన్ మిషన్ పథకాలను కేంద్రప్రభుత్వం అమలుచేస్తుందని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా కడియపుసావరంలో నిర్మించిన సచివాలయం, 2 వాటర్ ట్యాంకులు, పేపరుమిల్లు సమకూర్చిన ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరితో కలిసి పురందేశ్వరి ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ అమరావతి నిర్మాణానికి కేంద్రప్రభుత్వం రూ.11వేల కోట్లు ఇస్తుందన్నారు. అందులో భాగంగానే రూ.4,285 కోట్లు కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వడం జరిగిందన్నారు. పోలవరం నిర్మాణానికి రూ.12,500 కోట్లు ఇవ్వడానికి కేంద్రం ముందుకొచ్చిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచన కాకుండా లాభాల్లోకి తీసుకురావాలనే విషయం మీద దృష్టిపెట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యేలకు వారి పరిధిలో సుమారు 150 నుంచి 200 గ్రామాలు ఉంటాయని, అదే ఎంపీకి వారి పరిధిలో సుమా రు 1000 గ్రామాలు ఉంటాయన్నారు. ఎమ్మెల్యేల సహకారంతో స్థానికంగా సమస్యలు గుర్తిం చాలని ఆ సమస్యలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పరిదిలో ఆయా శాఖల మంత్రులతో చర్చించి పరిష్కరించి అభివృద్ధి చేయడానికి కృషి చేయవచ్చన్నారు. పేపరుమిల్లు ఈడీ ముఖేష్‌జైన్, సీఎస్ బి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ రూ. 2,900 కోట్లతో పరిశ్రమను విస్తరిస్తున్నట్టు తెలిపారు. సర్పంచ్ చెక్కపల్లి మురళీకృష్ణ, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, ప్రత్తిపాటి రామారావుచౌదరి, వరగోగుల వెంకటేశ్వరరావు, వెలుగుబంటి నాని, ఆకుల శ్రీధర్, బొర్సు సుబ్రహ్మణ్యం, వరగోగుల సత్యనారాయణ, సీఎస్ఆర్ మేనేజర్ దాసరి తాతారావు పాల్గొన్నారు.

ఇంటర్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో స్టేట్ టాపర్‌కి మంత్రి అభినందన



సాయిలక్ష్మి, ఆమె తల్లిదండ్రులకు ల్యాప్ టాప్ అందజేస్తున్న మంత్రి లోకేశ్

కాకినాడ రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల విద్యార్థిని డి.సాయిలక్ష్మి ఎలక్ట్రానిక్స్ విభాగంలో 1000కి 982 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. అమరావతిలో జరిగిన షైనింగ్ స్టార్స్-25 కార్యక్రమంలో ఆమెకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బంగారు పతకం, ల్యాప్‌టాప్ అందజేశారు. సాయిలక్ష్మి, ఆమె తల్లిదండ్రులను సత్కరించారు. భవిష్యత్తులో ఏమవు దామనుకుంటున్నావని ఆ విద్యార్థినిని లోకేశ్ అడగ్గా డిగ్రీ పూర్తి చేసి గ్రూప్స్ పరీక్షలకు ప్రిపేరవుతానని తెలిపింది. ఆమెను ప్రభుత్వమే ఉచితంగా చదివిస్తుందని ప్రిన్సిపాల్ తిరుపతి రెడ్డి తెలిపారు. సాయిలక్ష్మిని ఇంటర్మీడియట్ బోర్డు కమిషనరు కృతికా శుక్లా, కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు పీవీ శివప్రసాద్, నిరంజన్‌కుమార్ అభినందించారు.

ఇంటి నుంచే పౌరసేవలు

మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభం



సామర్లకోట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటి వద్ద నుంచే పౌరసేవలు వినియోగించుకునేందుకు కూటమి ప్రభుత్వం ఒకడుగు ముందుకేసింది. ప్రభుత్వం తాజాగా ప్రారంభించనున్న ఇంటి నుంచే పౌరసేవలు పొందేందుకు బయటకు రావాల్సిన అవసరం లేకుండా ఒకే వాట్సాప్ మెసేజ్‌తో పౌరసేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మనమిత్ర అనే నూతన వాట్సాప్ గవర్నెన్స్ వ్యవస్థను ప్రవేశపెట్టిందని, మరో 2,3 రోజుల్లో వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభం కాగలదని విశ్వసనీయ సమాచారం. ఈ వేదిక ద్వారా ప్రజలు ప్రస్తుత ధృవపత్రాలు, లైసెన్స్‌లు, పన్నుల చెల్లింపులు, బిల్లులు, దేవాలయ దర్శనాలు, పరీక్షల ఫలితాలు, వంటి 250కు పైబడి సేవలను పొందవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. జూన్ 12 నాటికి 500 సేవలు, ఏడాది చివరకు వేయి రకాల సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని జిల్లా ఉన్నతాధికారులు చెబుతున్నారు. ప్రజలందరూ వినియోగించుకుని తమకు కావాల్సిన పౌరసేవలను త్వరితగతిన పారదర్శకంగా పొందేలా ప్రభుత్వం నూతనాధ్యాయానికి శ్రీకారం చుట్టనుంది.

ప్రభుత్వాసుపత్రిలో యువకుల హల్‌చల్



రోగులతో మాట్లాడుతున్న యువకులు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో బుధవారం కొందరు యువకులు హల్‌చల్ చేశారు. ఆసుపత్రిలోని ఇన్‌పేషెంట్ వార్డుల్లో కలియదిరుగుతూ అక్కడి రోగులతో మాట్లాడుతూ వైద్యసేవలపై ఆరా తీశారు. వీడియోలు తీసుకున్నారు. ఆసుపత్రిలో రోగుల పరిస్థితి దారుణంగా ఉందని, పడుకునేందుకు బెడ్స్ లేవని, కరెంట్ లేదని తదితర సమస్యలను ప్రస్తావిస్తూ వీరసింగం అనే యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో పోస్టు పెట్టాడు. ఆ పోస్టు బుధవారం కొంత వైరల్ కావడంతో మాజీ ఎంపీ భరత్‌రామ్, కొన్ని మానవహక్కుల సంస్థల ప్రతినిధులు ఆసుపత్రికి వచ్చి పరిశీలించారు. ఇదే సమయంలో వీడియో పోస్టుపెట్టిన వీర సింగం అనే యువకుడు, అతడితోపాటు మరికొందరు యువకులు ఆసుపత్రికి చేరుకున్నారు. వారంతా ఆసుపత్రిలోకి ప్రవేశించి వార్డుల్లో కలియదిరిగారు. రోగులతో మాట్లాడుతూ వైద్యసేవలు ఎలా అందుతున్నాయంటూ ఆరా తీశారు. నర్సింగ్ స్టాఫ్‌ను సైతం ప్రశ్నించడం గమనార్హం. ఒక పక్క మాజీ ఎంపీ భరత్‌రామ్, మరోపక్క ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు పెట్టిన యువకుడు, అతడి వెంట వచ్చిన వారు వార్డుల్లో తిరిగారు. సుమారు 2 గంటలసేపు ఈ తతంగమంతా సాగింది. ఇంత జరుగుతున్నా ఆసుపత్రి అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది కానీ స్పందించకుండా చోద్యం చూస్తూ కూర్చున్నారు. ఇన్‌పేషెంట్ రోగులను కలిసేందుకు నిర్ణీత సమయంలోనే అనుమతిస్తామంటూ హుకుం జారీ చేసిన ఆసుపత్రి అధికారులు ఈ విషయంపై నోరుమెదపకపోవడం చర్చనీయాంశంగా మారింది.

కొత్తగా ట్రైన్



సాధారణంగా రైలు పట్టాలపై ట్రైన్ ఇంజన్లు వెళ్తుంటాయి. కానీ ట్రైన్ ఇంజన్ రోడ్డుపై కనిపిస్తే.. అదీ కూడా ట్రాలీ మీద ఉంటే ఎవరిచూపైనా పడాల్సిందే. అటువంటి దృశ్యమే కాకినాడ జిల్లా గండేపల్లిలో కనిపించింది. హైవేపై ట్రాలీ మీద ట్రైన్ ఇంజన్ తీసుకెళ్లడంతో స్థానికులు చూసి కొంచెం కొత్తగా ఉందని ఫొటోలు తీసుకున్నారు.

గండేపల్లి(ఆంధ్రజ్యోతి)

సంక్షేమమే కూటమి ధ్యేయం : ఎమ్మెల్యే గోరంట్ల


కడియపుసావరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలన సాగుతోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మండలంలోని కడియపుసావరంలో నిర్మించిన సచివాలయ భవనం, రెండు వాటర్‌ట్యాంక్‌లు, పేపరుమిల్లు సమకూర్చిన ట్రాక్టర్, దామిరెడ్డిపల్లిలో నిర్మించిన వాటర్‌ట్యాంక్, సీసీరోడ్డు, వీరవరంలో నిర్మించిన వాటర్‌ట్యాంక్‌లను ఎమ్మెల్యే గోరంట్ల బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా బాగాలేకున్నా అభివృద్ధికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఇందుకు కేంద్రం కూడా ఎంతో సహకారం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చెక్కపల్లి మురళీకృష్ణ, ముద్రగడ సత్యస్వరూప, బత్తుల నళినిజయంతిరాము, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, టీడీపీ, బీజేపీ, జనసేన మండలాధ్యక్షులు వెలుగుబంటి నాని, బొర్సు సుబ్రహ్మణ్యం, ముద్రగడ జమీ, నాయకులు ప్రత్తిపాటి రామారావుచౌదరి, నాగిరెడ్డి రామకృష్ణ, వరగోగుల వెంకటేశ్వరరావు, ఆకుల శ్రీధర్, వరగోగుల రుద్రయ్య, వాసిరెడ్డి రాంబాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీజీయూలో వాతావరణ గడియారం


వాతావరణ గడియారాన్ని, స్వర్ణ ధృవపత్రాన్ని గైట్ ప్రిన్సిపాల్‌కు అందజేస్తున్న దృశ్యం

రాజానగరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ)లో బుధవారం వాతావరణ గడియారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రోఛాన్సలర్ కె.శశికిరణ్ వర్మ మాట్లాడుతూ ఇంధన అక్షరాస్యతపై 2,500 మందికి పైగా విద్యార్థులకు గైట్‌లోని ఆటోమొబైల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ ఏడాది శిక్షణ కల్పించామన్నారు. దీనిలో భాగంగా స్వర్ణ ధ్రువపత్రంతో పాటు వాతావరణ గడియారాన్ని ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త, ఐఐటీ ముంబై ప్రొఫెసర్, ఎనర్జీ స్వరాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చేతన్‌సింగ్ సోలంకి అందజేశారు. ప్రపంచ వాతావరణ మార్పులపై అవగాన పెంచడానికి ఈ గడియారం దోహదపడుతుంద న్నారు. కార్యక్రమంలో వీసీ యు.చంద్రశేఖర్, ప్రో వీసీ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్, ఆటోమొబైల్ విభాగాధిపతి వి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

వార్డెన్లతో సమీక్షలో నన్నయ వీసీ

దివాన్‌చెరువు, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): మెస్ ఫీజులు, హాస్టల్ నిర్వహణ వ్యవహారాల్లో వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ సూచించారు. వర్శిటీలోని పురుషుల, మహిళలు వసతిగృహ నిర్వహణపై హాస్టల్ సిబ్బందితో బుధవారం వీసీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నతవిద్యను అభ్యసించి ఉన్నతశిఖరాలకు చేరుకోవాలనే ఆశయాలతో తల్లిదండ్రులను విడిచి పెట్టి హాస్టల్స్‌లో ఉండే విద్యార్థులను ఆదరించాల్సిన సిబ్బంది కఠినంగా వ్యవహరించడం సరికాదన్నారు. విద్యార్థుల మూలంగానే హాస్టల్స్ నడుస్తున్నాయనే విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పనిచేయాలన్నారు. సిబ్బంది వసతిగృహాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అసౌకర్యాలను తొలగించి విద్యార్థులకు చక్కని వాతావరణాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ వార్డెన్లు కె.శ్రీరమేష్, కె.రమణేశ్వరి, అసిస్టెంట్ వార్డెన్లు పాల్గొన్నారు.

నిర్మాణాల్లో నిబంధనలు పాటించకుంటే చర్యలు

మునిసిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు లేకుంటే చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. బుధవారం నగరంలోని తాడితోటలో ఒక హాస్పిటల్ ఆక్యుపెన్సీ బిల్డింగ్‌ను ఆయన పరిశీలించి భవన యజమానికి రైన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్స్‌ను భవనం విస్తీర్ణం ప్రాతిపదికగా ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం జేఎన్ రోడ్డులో కమర్షియల్ బిల్డింగ్ సెల్లార్ అప్రూవల్‌కు క్షేత్రస్థాయిలో పీజీబిలిటీ వెరిఫికేషన్ నిర్వహించారు. బాలాజీపేటలో ఓ గేటెడ్ కమ్యూనిటీ బిల్డింగ్ ప్లానులు పరిశీలించారు. అనుమతి పొందిన తర్వాతే బిల్డింగ్ నిర్మించాలన్నారు. అనంతరం కోరుకొండ రోడ్డు నుంచి కంబాలచెరువు వరకు డ్రైనేజీలు పరిశీలించారు. 3 కిలోమిటర్లు నడుచుకుంటూ ప్రతి స్ట్రెచ్‌ను పరిశీలించి, టెంపరరీ ఎంక్రోచ్మెంట్ల తొలగింపులు, పర్మనెంట్ ఎంక్రోచ్మెంట్ల మార్కింగ్స్, రోడ్డు వైడనింగ్ కోసం జరిపిన మార్కింగ్స్‌ను పరిశీలించారు. తక్షణమే పర్మనెంట్ ఎంక్రోచ్‌మెంట్ల తొలగించి రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. కోలమూరు పంచాయతీ పరిధిలో ఎయిర్‌పోర్టు రోడ్డులోని డ్రైన్లపై ఆక్రమణలు తొలగించాలని మెయిన్ రోడ్డు లెవెల్‌కు చదును చేసి వ్యాపార సంస్థలు డ్రైన్లకు అవతల మాత్రమే నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఏడీహెచ్ స్వాతి, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి : బీవీఆర్

కోరుకొండ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో టీడీపీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ద తీసుకుంటామనిటీడీపీ ఇన్‌చార్జి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. బుధవారం బూరుగుపూడి టీడీపీ కార్యాలయం వద్ద రాజానగరం నియోజకవర్గం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం అయ్యారు.గ్రామాల వారీగా కార్యకర్తల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు తనకాల నాగేశ్వరరావు, కోరుకొండ, సీతానగరం,రాజానగరం టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నల్లమిల్లిని కలిసిన డిప్యూటీ ఎంపీడీవోలు

రంగంపేట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): విస్తరణాధికారుల హోదాను రాష్ట్రం ప్రభుత్వం ఇటీవల డిప్యూటీ ఎంపీడీవోలుగా మార్పు చేయడమే గాక, అత్యంత కీలకమైన పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగుల సంక్షేమం కోసం అనేక సంస్కరణలు చేపట్టింది. ఈ నేపథ్యంలో బుధవారం నియోజకవర్గంలోని డిప్యూటీ ఎంపీడీవోలందరూ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే అభినందనలు తెలిపి సత్కరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో రంగంపేట, అనపర్తి, బిక్కవోలు, పెదపూడి మండలాల ఎంపీడీవోలు ఉన్నారు.

కాంగ్రెస్ అగ్రనేతలపై కేసును నిరసిస్తూ ధర్నా

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ పత్రిక ఆస్తులను కుట్ర పూరితంగా, ఏకపక్షంగా జప్తు చేసి కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీలపై చార్జి షీట్ ఫైల్ చేయడాన్ని నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ఆదాయపు పన్నుల శాఖ కార్యాలయ వద్ద ధర్నా నిర్వహించారు. బుధవారం ఉదయం జరిగిన ఈ ధర్నాలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ వడయార్, పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్ మాట్లాడారు. ఎన్ని కుట్రలు చేసినా 2029లో రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తూర్పుకాపులకు న్యాయం చేయండి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తూర్పుకాపులకు న్యాయం చేయాలని ఏపీ తూర్పుకాపు ఐక్యత సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గాడి శ్రీను అన్నారు. స్థానిక మల్లికార్జునగర్ వాటర్ ట్యాంక్‌ల వద్ద బుధవారం యాద్రి రాజు అధ్యక్షతన జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. 40 ఏళ్ల క్రితం తూర్పుకాపులు ఉపాధి కోసం ఈ ప్రాంతాలకు వచ్చారని ఆర్థికంగా వెనుకబడి అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

కలెక్టర్‌కు వైసీపీ నాయకుల వినతి

రాజమహేంద్రవరం కల్చరల్ ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): బలభద్రపురానికి సమీపంగా ఏర్పాటు చేసిన చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్‌ను వ్యతిరేకిస్తూ గ్రామస్థుల తరపున వైసీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఈ ప్లాంట్ ఏర్పాటు వల్ల కలిగే అరోగ్య సమస్యలను ఆమెకు వివరించగా అన్ని అంశాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

లీలాశ్రావణికి మంత్రి లోకేశ్ అభినందన



బిక్కవోలు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో జడ్పీ హెచ్ఎస్ ప్లస్ మహిళా కళాశాలల్లో రాష్ట్రంలో పందలపాక విద్యార్థిని ఆర్.లీలాశ్రావణి 943 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. దీంతో ఆమెను మంగళవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ అభినందించి ల్యాప్‌టాప్‌ను బహూకరించి మెడల్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా ప్లస్ కళాశాలలపై అభిప్రాయం చెప్పాలని మంత్రి కోరగా అతి పేదతరగతికి చెందిన విద్యార్థులు ఈ కళాశాలల్లో చేరుతున్నారని, అయితే తగినంత మంది అధ్యాపకులు లేకపోవడంతో ఫలితాలు సాధించలేక పోతున్నారని వివరించారు. అలాగే ఎంపీసీ, బైపీసీ గ్రూపుల వారికి అదే కళాశాలల్లో ల్యాబ్‌లు కూడా ఏర్పాటు చేయాలని లీలాశ్రావణి కోరారు.

ఆదర్శనీయుడు వీరేశలింగం

నన్నయ వీసీ ప్రసన్నశ్రీ
సంఘసంస్కర్త వీరేశలింగం జయంతి
పలువురి ఘన నివాళి

దివాన్‌చెరువు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులును ఆదర్శంగా తీసుకుని సమాజ హితం కోసం జీవించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. కోరారు. బుధవారం వర్శిటీలోని తెలుగుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కందుకూరి వీరేశలింగం జయంతి కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి కందుకూరి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ కందుకూరి సమాజ సంస్కరణకు చేసిన కృషినికొనియాడారు. తెలుగుశాఖలో కందుకూరి వీరేశలింగం, ఆదికవి నన్నయలను ఆప్షనల్ సబ్జెక్టులుగా చదువుతున్న విద్యార్థులు వారి ఔన్నత్యాన్ని ఇతరులకు తెలియజేసేవిధంగా ఎదగాలని సూచించారు. ఇటీవల రత్నసింహ్‌జీ మహీదా స్మారక అవార్డు అందుకున్న వీసీ ప్రసన్నశ్రీని తెలుగుశాఖ ఆధ్వర్యంలో అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి, తెలుగుశాఖ అధ్యాపకులు తలారివాసు, కేవీఎన్‌డీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కడియం: కడియం పంచాయతీ ఆవరణలో చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి కళాసేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన వీరేశలింగం పంతులు జయంతి కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ మాట్లాడారు. మహనీయుల త్యాగాలు నేటి యువతకు తెలియాలన్నారు. కార్యక్రమంలో కళాసమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడపా సుబ్రహ్మణ్యం, చిలుకూరి శ్రీనివాసరావు, తోరాటి వసంతరావు నేతృత్వంలో ప్రముఖ నాటక కళాకారులు బొర్రా రామకృష్ణ, శీలం సుబ్బారావు, కొప్పిశెట్టి చినవెంకట్రావు(చంటి)లకు కందుకూరి నాటకరత్న అవార్డులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ప్రముఖ సాహితీవేత్త నాటక రచయిత కందుకూరి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం నాటక దినోత్సవంగా జరపడం ఎంతో ముదావాహం అన్నారు. అంతకు ముందుగా కందుకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని, నీటి సంఘం చైర్మన్ చిక్కాల ఈశ్వర్రావు, పుల్లారావు, బోణం సత్యనారాయణ, చిక్కాల ఉమామహేశ్వరావు, కొత్తూరి కృష్ణ, తమ్మిశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.


కడియంలో నాటక కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

ఘనంగా నాటకరంగ దినోత్సవం

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ జీవితాన్ని ఆవిష్కరించే కళ నాటకం అని ప్రముఖ నాటక కళాకారులు సీహెచ్ సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం నాటకరంగ దినోత్సవాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నాటకరంగం అనాదిగా ప్రజలకు కాలక్షేపానికే కాకుండా సమాజ మార్పునకు వేదిక అయ్యిందన్నారు. కందుకూరి నాటకం అవార్డు గ్రహీత డీఎస్‌పీ రావు మాట్లాడుతూ అర్ధ శతాబ్దంపైగా నాటకరంగమే ఊపిరిగా జీవించినవాళ్లం తాము అని, నాటకమే తమ ప్రాణమని అన్నారు. నాటక పరిశోధకుడు పీవీబీ సంజీవరావు, కళాకారిణి సురభి సువర్ణ మాట్లాడారు. హార్మోనియం నిపుణులు కలిగట్ల వెంకటరమణ కళాకారులు పాడిన పద్యాలకు లయబద్ధమైన సంగీతాన్ని అందించారు. ఈ సందర్భంగా పలువురు నాటకరంగ కళాకారులను సత్కరించారు. సభకు కళాశాల ప్రిన్సిపాల్ డీవీ రమణమూర్తి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శరత్‌బాబు, వై.స్వర్ణశ్రీ, ఎస్.రాజ్‌కుమార్, పల్లి సుధా, జే.సుగుణ తదితరులు పాల్గొన్నారు.

జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలి

సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి, వర్ధంతిలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ డిమాండ్ చేశారు. కందుకూరి జయంతి సందర్భంగా రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండు సెంటర్లోని వీరేశలిగం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖుల వర్ధంతి, జయంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తామని ఇటీవల జాబితా విడుదల చేశారని, అందులో కందుకూరికి చోటు కల్పించలేదన్నారు. దీనిపై ప్రభుత్వం తక్షణం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో బి.పవన్, సీఐటీయూ నాయకులు పూర్ణిమరాజు, ఎస్ఎస్ మూర్తి, కేవీ రామచంద్రరావు పాల్గొన్నారు.


రాజమహేంద్రవరంలో నాటకరంగ కళాకారులకు సత్కారం

1880లో తొలి వితంతు వివాహం : ఎంపీ

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కందుకూరి వీరేశలింగం పంతులు మహిళలపై వివక్షను రూపుమాపి, మహిళలను చైతన్యం చేయాలనే సంకల్పంతో, 1880లో మొట్టమొదటి వితంతు వివాహం జరిపించారని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా వీటీ కళాశాల, ఆనంద్ గార్డెన్స్‌లోని వీరేశలింగం సమాధి వద్ద ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి ఆమె పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీరేశలింగం సంఘ సంస్కర్తే కాక, గొప్ప రచయితని, రాజశేఖర చరిత్రం అనే నవలను రాసి, తెలుగు సాహిత్యంలో నవలా ప్రక్రియకు నాంది పలికారు. వీరేశలింగం జయంతి సందర్భంగా శిథిలావస్థలో ఉన్న వారి ఇల్లు కోసం రూ.35 లక్షలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్టు పురందేశ్వరి అన్నారు. సోము వీర్రాజు మాట్లాడుతూ వీరేశలింగం రాజమండ్రిలో ఎన్నో విద్యా సంస్థలు నెలకొల్పారని, తాను అందులోనే చదువుకున్నానన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఐకాన్స్ సంస్థ వీరేశలింగం నివాసంలో చెదలు పట్టి దెబ్బతిన్న విలువైన పుస్తకాలు, షెల్ఫుల రక్షణ బాధ్యతను తీసుకుంది. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సభ్యుడు శ్రీ పెస్టిస్ కంపెనీ వ్యవస్థాపకుడు బొల్ల వెంకటరావు రూ.3 లక్షల మందులను ఉచితంగా ఇచ్చారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ తీగెల రాజా, సెక్రటరీ సురేష్ ఉదయగిరి, రోటరీ ఐకాన్స్ కరుటూరి ఉదయ్, శ్యామ్ పొన్నాడ, మోంటి జైన్, వీరేంద్ర సూర్యనారాయణ మూర్తి, దావూద్, శరత్‌చంద్ర అనిల్ మాదిరెడ్డి పాల్గొన్నారు. అలాగే ఆనంద్ గార్డెన్స్‌లో వీరేశలింగం సమాధులకు మాజీ ఎంపీ మార్గాని భరత్ నివాళులర్పించారు.


కందుకూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నన్నయ వీసీ

విద్యార్థులకు సంపూర్ణ మనో వికాసం అవసరం

ఎంపీ పురందేశ్వరి


సమావేశంలో పాల్గొన్న పురందేశ్వరి, బత్తుల, బీవీఆర్

సీతానగరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సంపూర్ణ మనో వికాసం కలిగే విధంగా గురువులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఉపాధ్యాయులను కోరారు. బుధవారం మండలంలోని వెదుళ్లపల్లిలోని ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించిన కాంపౌండ్ వాల్, సత్య బొల్లీస్ సైన్స్ ల్యాబ్, డైనింగ్ హాల్‌లను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరిలతో కలసి ఆమె ప్రారంభించారు. దాత బొల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పురందేశ్వరి మాట్లాడుతూ ప్రస్తుతం విద్య అంటే క్లాస్ రూమ్‌లు, మెడల్స్ ర్యాంకులు అనుకుంటున్నారని, విద్యార్థుల్లో సామాజిక స్పృహ, సమాజం పట్ల బాధ్యత, దేశభక్తి విస్మరిస్తున్నారన్నారు. కొంత మంది గురువుల వెర్రి పోకడలు చూ స్తుంటే తల్లిదండ్రులు ఆందోళన కలిగించే పరిస్థితులు ఉన్నాయన్నారు. గురువులు తరగతి గదుల్లో పాఠ్య పుస్తకాల్లో ఉన్న వాటిని మాత్రమే చెప్పి వదిలేయకుండా సామాజిక స్పృహ కల్గించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులతో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, తనకాల నాగేశ్వరరావు, మండలాధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి, వలవల రాజా, మట్ట వెంకటేష్ పాల్గొన్నారు.

'గట్టి' కుటుంబానికి ఎంపీ పరామర్శ

కడియం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పితృ వియోగంతో బాధపడుతున్న మాజీ సర్పంచ్ గట్టి నర్సయ్య, గట్టి సుబ్బారావులను బుర్రిలంక లోని వారి నివాసంలో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పరామర్శించారు. ముందుగా గట్టి సత్యనారాయణమూర్తి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ ఇన్‌చార్జి ఆకుల శ్రీధర్, మండలాధ్యక్షుడు బొర్సు సుబ్రహ్మణ్యం, పాటంశెట్టి సూర్యచంద్రరావు, మార్గాని సత్యనారాయణ, పుల్లా రామారావు, నర్సరీ సంఘం అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వాసుదేవ్



రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మార్కెట్ కమిటీ చైర్మన్‌లలో రాజమహేంద్రవరం రూరల్ మండలానికి చెందిన టీడీపీ నేత మార్ని వాసుదేవ్‌కు అవకాశం దక్కింది. బుధవారం విడుదల చేసిన మార్కెట్ కమిటీలలో రాజమహేంద్రవరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపిక చేయడంపై వాసుదేవ్ ఆనందం వ్యక్తం చేశారు. ఆయన టీడీపీలో సుదీర్ఘకాలం పనిచేశారు. గతంలో పార్టీ మండలాధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రధాన అనుచరులలో వాసుదేవ్ ఒకరు. తనకు రాజమహేంద్రవరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించిన సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే గోరంట్లకు వాసుదేవ్ ధన్యవాదాలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : నల్లమిల్లి

- అనపర్తిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- ప్రజల నుంచి అర్జీల స్వీకరణ


అనపర్తిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం అనపర్తిలోని రజక సంఘ కళ్యాణ మండపంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మండలం లోని వివిధ గ్రామాల నుంచి తాగునీరు, విద్యుత్, రోడ్లు, తదితర సమస్యలపై 26 అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్జీల్లోని సమస్యలపై ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సత్వర పరిష్కార దిశగా కృషి చేయాలన్నారు. అలాగే కుమ్మరి వీధిలో మంజు సెంటర్‌లో ఏర్పాటు చేసిన పోషణ్ పక్వాడ కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లమిల్లి విచ్చేసి గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమాలను నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద మొక్కను నాటారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

బిక్కవోలు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంకుదురు, మెళ్లూరు, ఆరికరేవుల గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లు డ్రైయిన్లను ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రారంభించి, వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజలు చేశారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తేతలి సుమ, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, రావాడ నాగు, దుర్గారెడ్డి, ఇందల వీరబాబు, సర్పంచ్ రెడ్డి నాగవేణికుమారి, జడ్పీటీసీ రొంగల పద్మావతి, ఎంపీటీసీలు పీవీ, అమ్మిరెడ్డి పలువురు అధికారులు పాల్గొన్నారు. మెళ్లూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేయాలంటూ నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొని నవధాన్యాల సాగుకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

పరువునష్టం దావా వేశా : నల్లమిల్లి

అనపర్తి: వైసీపీ నాయకుల రాజకీయ ప్రయోజనాల కోసం తన ప్రతిష్టను దెబ్బ తీసే విధంగా(ఆంధ్రజ్యోతి కాదు) వేరొక దినపత్రికలో ప్రచురించిన అసత్య కథనంపై కోర్టును ఆశ్రయించినట్టు ఎమ్మెల్యే నల్లమిల్లి తెలిపారు. అనపర్తిలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల పెదపూడి పోలీసులు గంజాయి సరఫరా చేస్తున్న కొందరు యువకులను అరెస్టు చేశారని వీరిలో కైకవోలుకు చెందిన గణేష్ తనతో తీసుకున్న సెల్ఫీ ఫొటో పెట్టి గణేష్ తన అనుచరుడంటూ వార్త ప్రచురించారన్నారు. గణేష్ తన అనుచరుడైతే విడిపించేందుకు తాను ప్రయత్నించి ఉండాలి కదా అటు వంటిదేమీ లేనప్పుడు తన అనుచరుడంటూ ఎలా వార్త ప్రచురిస్తారన్నారు. తప్పుడు వార్త రాసి తన ప్రతిష్టకు భంగం కలిగించినందుకు పత్రికా యాజమాన్యంపై రూ.1 కోటి పరువు నష్టం దావా వేస్తూ నోటీసులు పంపిస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు జుత్తుగ సూర్యకుమారి, కరకుదురు దత్తుడు, రావాడ నాగు, పుట్టా గంగాధరచౌదరి పాల్గొన్నారు.

అచ్చుతాపురంలో అన్నసమారాధన

గోకవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చుతాపురం గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం భారీ అన్నసమారాధన జరిగింది. సుమారు 3వేల మందికి పైగా భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఆర్థిక సాయం అందజేశారు.

దుర్భర పరిస్థితుల్లో ప్రభుత్వ బోధనాసుపత్రి: భరత్

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బోధనాసుపత్రిలో రోగులకు వైద్యసేవల విషయంలో జరుగుతున్న నిర్లక్ష్యంపై ప్రభుత్వం తక్షణమే విజిలెన్స్ విచారణ జరిపించాలని, బాధ్యులను సస్పెండ్ చేయాలని మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ డిమాండ్ చేశారు. రోగులను పట్టించుకోవడంలేదంటూ వీర సింగం అనే యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన పోస్టుపై మాజీ ఎంపీ భరత్‌రామ్ స్పందిస్తూ బుధవారం ప్రభుత్వబోధనాసుపత్రిని సందర్శించి పలు విభాగాలను తనిఖీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభతో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బోధనాసుపత్రిలో దుర్భరమైన పరిస్థితులు నెలకొన్నాయన్నారు.


పీ4కు సహకరిద్దాం: ఎమ్మెల్యే

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం, అభివృద్ధిని కాంక్షిస్తూ సీఎం చంద్రబాబు ఇచ్చిన పిలుపును ఉన్నత స్థాయిలో ఉన్నవారంతా సాగ్వతించి సహకరించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. పేదల ఆర్థికాభివృద్ధి నేపథ్యంలో ఆయన పీ4 విధానాన్ని తీసుకువచ్చారన్నారు. సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వారు ప్రపంచంలో నలుమూలలా ఉన్న తెలుగు వారు పేదలను ఆదుకోవాలని చంద్రబాబు ఇచ్చిన పిలుపునకు స్పందించాలని కోరారు. స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు కూటమి కృషి చేస్తోందన్నారు. రాష్ట్రాన్ని ప్రత్యేకంగా చూసి ఆర్థిక సాయమందించాలని స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికకు ఊతమివ్వాలని 16వ ఫైనాన్స్ కమిషన్‌ను చంద్రబాబు కోరారని వాసు పేర్కొన్నారు.

విద్యార్థిని కమలకు సత్కారం



రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్ర జ్యోతి): రాజమహేంద్రి ఉమెన్స్ కళాశాల విద్యార్థిని, దివాన్‌చెరువు బీజాపురి టౌన్‌షిప్‌కు చెందిన సర్వసిద్ధి కమల ఈ ఏడాది ఇంటర్‌లో ఎంఈసీ గ్రూప్‌లో కాలేజీ టాపర్‌గా నిలిచింది. దీంతో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి చేతులమీదుగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, బీజేపీ నాయకులు పిక్కి నాగేంద్ర, నీరుకొండ వీరన్నచౌదరి, ఏపీఆర్ చౌదరి సమక్షంలో కమలను సత్కరించారు.





రాజమహేంద్రవరం ఆనంద్‌గార్డెన్స్‌లో కందుకూరి సమాధి వద్ద ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు నివాళులు

మళ్లీ 'నామినేటెడ్' సందడి

- ఉమ్మడి 'తూర్పు' జిల్లాలో నాలుగు మార్కెట్ కమిటీలకు చైర్మన్ల ప్రకటన
- నాలుగు ఏఎంసీలూ టీడీపీకి కేటాయింపు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మరోసారి నామినేటెడ్ పదవుల సందడి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం పలు మార్కెట్ కమిటీలకు చైర్మన్లను ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 30 ఏఎంసీ చైర్మన్ల జాబితాను బుధవారం విడుదల చేయగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నలుగురిని నియమించారు. నాలుగు మార్కెట్ కమిటీలను టీడీపీకి కేటాయించారు. కాకినాడ జిల్లాలోని కాకినాడ అర్బన్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బచ్చు శేఖర్, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మార్ని వాసుదేవ్, కొవ్వూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నాదెళ్ల శ్రీరామ్ చౌదరి,డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అయినవిల్లి టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్‌ను నియమించారు.

22 నుంచి డెల్టా కాలువలు మూసివేత

- ఇరిగేషన్ మంత్రి ఆదేశాలతో మూసివేత గడువు పెంపు

ధవళేశ్వరం,ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): డెల్టా కాలువలు ఈనెల 22 నుంచి మూసివేయనున్నారు. రబీ అనంతరం ఖరీఫ్‌లో సాగునీరు సక్రమంగా పారేందుకు డెల్టా కాలవల షెట్టర్లు, లాకులు వంటి మరమ్మతులు(క్లోజర్ పనులు) చేపట్టడానికి కాల్వలకు నీటి విడుదల నిలిపివేస్తారు.డెల్టా కాలువలు ఈనెల 16వ తేదీనే మూసివేసేందుకు సిద్ధంకాగా గ్రామాల్లో తాగునీటి చెరువులు నింపుకోవడం, ఇతరత్రా అవసరాల నిమిత్తం ఈ నెల 22 వరకు నీటిని విడుదల గడువు పెంచారు. ఇరిగేషన్ మంత్రి ఆదేశాలతో కాల్వల మూసివేతను 22వ తేదీ వరకు వాయిదా వేశారు. బుధవారం కాటన్‌బ్యారేజ్ నుంచి తూర్పుడెల్టాకు 1200 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1100 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 3 వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరంవద్ద నీటిమట్టం 9.30 అడుగులుగా నమోదైంది.

రబీని గట్టెక్కించిన సీలేరు జలాలు

తూర్పు,మధ్య, పశ్చిమ డెల్టాలోని 8.96 లక్షల ఎకరాలకు రబీలో సాగునీటిని సమృద్ధిగా అందించారు. డిసెంబర్ నుంచి నేటి వరకు మూడు డెల్టా కాలువలకు 114.644 టీఎంసీల నీటిని కాటన్ బ్యారేజ్ నుంచి విడుదల చేశారు. సీలేరు నుంచి పవర్ జనరేషన్‌ద్వారా 44.084 టీఎంసీలు గోదావరికి విడుదల కాగా బైపాస్ మార్గం ద్వారా నేరుగా 17.781టీఎంసీలు విడుదల చేశారు. సీలేరు నుంచి మొత్తం 61.865 టీఎంసీలు గోదావరికి విడుదలయ్యాయి.పోలవరం వద్ద 16 టీఎంసీల నీటి నిల్వలు ఉంటాయని అధికారులు లెక్కకట్టగా రబీ సీజన్‌లో గోదావరిలో సహజ జలాల లభ్యత 36 టీఎంసీలకు పైగా ఉంది. గత రబీసీజన్‌లో అప్పటి వైసీపీ ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్ర సాగునీటి ఎద్దడి నెలకొన్నారు. అప్పట్లో మార్చి నెలాఖరు నాటికి ధవళేశ్వరంవద్ద గోదావరి నీటిమట్టం 5.50 అడుగులకు పడిపోయింది. పాండ్‌లో నీరు డెల్టా కాలువలకు ప్రవహించని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం నాయకులు,అధికారుల సమన్వయంతో రబీకి సమృద్ధిగా సాగునీరందించారు.



ప్లస్ కాదు.. మైనస్!


ఇంటర్ అంటే విద్యార్థి భవిష్యత్.. అక్కడ వేసిన అడుగే ముందుకు నడిపిస్తుంది.. ఇంజనీరింగ్.. మెడిసిన్.. ఐఐటీ..జేఈఈ వంటి ఉన్నత చదువులకు పునాది ఇక్కడే.. అటువంటి పునాదికి జగన్ మంగళం పాడేశారు. రెండేళ్ల కిందట వైసీపీ ప్రభుత్వ హయాంలో హైస్కూల్స్‌లో 'ప్లస్' అంటూ ఉన్నత పాఠశాలల్లో ఆర్భాటంగా ఇంటర్మీడియట్ కోర్సులను ప్రారంభించారు.విద్యార్థుల బోధన అంశాన్ని గాలికొదిలేశారు. దీంతో హైస్కూల్ ప్లస్‌లు విద్యార్థుల జీవితాలను మైనస్‌లో పడేస్తున్నాయి. ఈ ఏడాది కొన్ని పాఠశాలల్లో ఒక్కరూ పాస్ కాలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వం దీనిపై పునరాలోచించాలి.

- ప్లస్ 2 ఇంటర్‌తో అవస్థ
- హైస్కూళ్లలో సౌకర్యాలు కరువు
- సున్నా ఫలితాలు..దిగజారిన ఉత్తీర్ణత
- విద్యార్థుల భవితతో చెలగాటం
- జగన్ అనాలోచిత నిర్ణయం ఫలితం
- గతేడాది పాస్ శాతం అంతంతే
- ఏడాదైనా మారని తీరు..
- సర్కారు దృష్టి పెట్టాల్సిందే..

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

హైస్కూల్ ప్లస్ అనేది రెంటికీ చెడ్డ రేవడిగా తయారైంది.పాఠశాల విద్యాశాఖ పదో తరగతి వరకూ దృష్టి సారిస్తోంది. జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఇంటర్ బోర్డు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. కానీ హైస్కూల్ ప్లస్ మాత్రం ఎటు కాకుండా పోతోంది. దీంతో విద్యార్థుల చదువు చతికిలబడుతోంది.గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 'హైస్కూలు ప్లస్' పేరుతో ఏర్పాటు చేసిన ఇంటర్‌కు రెండేళ్లలో పరీక్షలకు హాజరైన విద్యార్థుల ఉత్తీర్ణత గణనీయంగా పడిపోయింది.కొన్ని స్కూళ్లలో అయితే సున్నా ఫలితాలు వచ్చాయి.హైస్కూలు ప్లస్‌లో సరైన మౌళిక సదుపాయాలు, నిపుణులైన అధ్యాపకులు లేకపోవడంతో విద్యార్థుల భవిత పూర్తిగా అంధకారమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ విద్యార్థులకు హైస్కూలు ఉపాధ్యాయులతోనే విద్యాబోధనను మమ అనిపించారు.దాంతో ఆ హైస్కూలు ప్లస్‌లో చదివిన విద్యార్థులు ఉత్తీర్ణత శాతం గణనీయంగా పడిపోయింది.

ఇంటర్ ఫలితాల్లో వెనుకబడింది!



14 కేంద్రాల్లో.. ఫలితం సున్నా..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో ప్రథమ సంవత్సరానికి చెందిన హైస్కూలు ప్లస్ విద్యార్థులు 300 మంది పరీక్షలకు హాజరైతే వారిలో 81 మంది అంటే 27.5 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. 219 మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరంలో ఫెయిలయ్యారు. ఇక ద్వితీయ సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 224 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైతే వారిలో 112 మంది అంటే 50 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కోనసీమ జిల్లా అంతర్వేదిపాలెం, కందికుప్ప, ర్యాలి, పి.గన్నవరం, ఐ.పోలవరం, గొల్లవిల్లి, ముంగండ, జి.వేమవరం పాఠశాలల్లో ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్‌లో సున్నా ఫలితాలు నమోదయ్యాయి. ద్వితీయ సంవత్సరం అంతర్వేదిపాలెంలో సున్నా ఫలితాలు వెలువడ్డాయి. తూర్పుగోదావరి జిల్లాలో ప్రథమ సంవత్సరంలో సింగంపల్లి,సత్యవాడ,పోతవరం, పెరవలి కేంద్రాల్లో, ద్వితీయ సంవత్సరం అనపర్తిలో సున్నా ఫలితాలు నమోదయ్యాయి.

ఏ జిల్లా చూసినా ఇదే తీరు..

తూర్పుగోదావరి జిల్లాలో 22 ఉన్నత పాఠశాలల్లో 'హైస్కూల్ ప్లస్' అనే పేరుతో ఇంటర్మీడియట్ మొదటి ఏడాది కోర్సులను ప్రారంభించారు. తర్వాత రెండో ఏడాది 14 స్కూళ్లలో అందుబాటులోకి తెచ్చారు. అయితే లెక్చరర్ల నియామకం, ప్రయోగశాలలు, మౌళిక సదుపాయాల ఏర్పాటును పట్టించుకోలేదు. సరైన తరగతి గదులు లేవు. హైస్కూల్ ఉపాధ్యాయులతోనే ఆయా సబ్జెక్టుల్లో పీజీ చేసిన వారితో ఈ విద్యార్థులకు పాఠాలు చెప్పిస్తున్నారు. ఆ ఉపాధ్యాయులు వారి రెగ్యులర్ తరగతులు చూసుకొని ఇంటర్ విద్యార్థులకు చెప్పాల్సి వస్తోంది. కొన్ని స్కూల్స్‌లో పరీక్షలు దగ్గరకు వచ్చినా కోర్సులో ఏ పుస్తకాలు ఉంటాయి, వాటిలో ఏమి పాఠాలు ఉంటాయనేవి కూడా చాలా మంది విద్యార్థులకు అవగాహన లేకుండా ఉంటుందంటే హైస్కూల్ ప్లస్ విద్యార్థుల దుస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

స్కూలా.. కాలేజీనా?

ఒకటి నుంచి ఐదు వరకూ ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం జరుగుతుంది. వాళ్లు ఆరు నుంచి ఉన్నత పాఠశాల (హైస్కూల్)కి వెళతారు. దీంతో హైస్కూల్ విద్యార్థులమనే ఒక రకమైన ఆనంద భావనతో పిల్లలుంటారు. తర్వాత ఇంటర్మీడియట్ కోసం కళాశాల(జూనియర్ కాలేజీ)లో చేరతారు. అప్పటి వరకూ స్కూల్ పిల్లలమనే భావన నుంచి కాలేజీకొచ్చామంటూ కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టినట్టు ఫీలవుతారు. అక్కడ మాస్టారు.. ఇక్కడ లెక్చరర్‌గా విద్యను బోధిస్తారు. ఇదంతా పిల్లల మానసిక పరిపక్వత, ఆలోచన సామర్థ్యం, సృజనాత్మకత పెంపుదలకు దోహదపడుతుందని విద్యానిపుణులు చెబుతున్నారు. కానీ హైస్కూల్ ప్లస్ పేరుతో పిల్లలను అక్కడే ఉంచేసి వాళ్లలో గందరగోళాన్ని నింపారు.ఆ ప్రభావం చదువుపై పడే అవకాశం లేకపోలేదని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కార్తీక్ విశ్లేషించారు.జూనియర్ కళాశాలల మాదిరిగా లెక్చరర్లు,మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలలను అందుబాటులోకి తెస్తే పరిస్థితి మారవచ్చు.

ఈ ఏడాది ఫలితాలివీ

తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఈ ఏడాది ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో హైస్కూల్ ప్లస్ పాఠశాలలు కొన్ని చాలా దారుణమైన ఫలితాలను నమోదు చేశాయి. ఐదు పాఠశాలల్లో మొదటి ఏడాది, ఒక పాఠశాలలో రెండో ఏడాది ఒక్కరూ పాస్ కాలేదు. మొదటి ఏడాది రోల్ 483 ఉంటే 454 మంది పరీక్షలకు హాజరయ్యారు. దీంట్లో కేవలం 182 మంది మాత్రమే గట్టెక్కారు. రెండో ఏడాది 283కి 269 మంది పరీక్షలు రాయగా 160 మంది ఉత్తీర్ణత సాధించారు. అయితే గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ఉత్తీర్ణత కాస్త మెరుగుపడడం గమనార్హం.

తూర్పుగోదావరి జిల్లాలో ఫలితాలు ఇలా

హైస్కూల్ ప్లస్ కేంద్రం	ప్రథమ హాజరు	ఉత్తీర్ణత	ద్వితీయ హాజరు	ఉత్తీర్ణత
1.రాజమండ్రి సిటీ	29	8	0	0
2.బిక్కవోలు	16	1	0	0
3.అనపర్తి	41	8	6	0
4.పాతతుంగపాడు	19	2	0	0
5.రాజమండ్రిరూరల్	43	26	43	30
6.రాజానగరం	38	21	24	20
7.సింగంపల్లి	8	0	7	4
8.వెదుళ్లపల్లె	32	17	13	6
9.కుతుకులూరు	11	1	0	0
10.పందలపాక	23	3	13	8
11.కామరాజుపేట	36	14	22	14
12.కడియం	29	9	35	14
13.గాడాల	21	8	23	14
14.సత్యవాడ	2	0	0	0
15.ఖండవల్లి	0	0	0	0
16. పోతవరం	12	0	0	0
17.ఉండ్రాజవరం	7	3	12	7
18.చాగల్లు	18	4	14	9
19.దేవరపల్లి	11	7	16	8
20.నల్లజర్ల	39	17	25	19
21.పెరవలి	4	0	0	0
22.అన్నదేవరపేట	15	7	16	7
	454	182	269	160

దేవీపట్నంలో హాజరు 41.. పాస్ జీరో!

(రంపచోడవరం/రాజవొమ్మంగి-ఆంధ్రజ్యోతి) : అల్లూరి జిల్లా రంపచోడవరం మన్యంలో మూడు చోట్ల ఉన్నత పాఠశాలల్లో ప్లస్ టు జూనియర్ కళాశాలలు నడుస్తున్నాయి. రాజవొమ్మంగి జిల్లా పరిషత్ జూనియర్ కళాశాల, అడ్డతీగల జిల్లా పరిషత్ జూనియర్ కళాశాల, దామనపల్లి గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ప్లస్ టు కళాశాలలకు సంబంధించి ప్రథమ సంవత్సరంలో అడ్డతీగల, దేవీపట్నంలో జీరో ఫలితాలు వచ్చాయి. దేవీపట్నంలో మొదటి ఏడాదిలో 41 మంది పరీక్షలు రాయగా ఒక్కరూ పాస్ కాలేదు. రాజవొమ్మంగిలో గత రెండేళ్ల నుంచి మొదటి సంవత్సరంలో ఏ ఒక్కరూ పాస్ కాకపోగా, ఈ ఏడాది ముగ్గురు విద్యార్థులు మాత్రమే పాసయ్యారు.

నెలవారీ లక్ష్యాలు పూర్తి చేయండి : కలెక్టర్



సచివాలయ సందర్శనలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సమస్య ఏదైనా ముందుగా తెలుసుకుంటేనే పరిష్కారం చూపడం కూడా సాధ్యమౌతుందని కలెక్టర్ పి ప్రశాంతి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అన్ని ప్రభుత్వ శాఖ అధికారులతో బుధవారం 2025-26 వార్షిక ప్రణాళికపై సమన్వయ శాఖల సమావేశం నిర్వహించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో సీజనల్ టార్గెట్స్, హౌసింగ్ ,జిల్లా గ్రామీణాభివృద్ధి తదితర శాఖల నెలవారీ పురోగతి మేరకు లక్ష్యాలను సాధించేందుకు సరైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. మైన్స్ ఆధ్వర్యంలో నెలకు 24 వేల మెట్రిక్ టన్నులు, వర్షాకాలం కోసం 18 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి తేవడంపై దృష్టిసారించాలన్నారు. ప్రజాప్రతినిధులతో కలిపి ఈనెల 21 న స్కూల్స్ సందర్శన చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జేసీ చిన్నరాముడు, డీఆర్వో సీతారామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో జవాబుదారీతనం ఉండాలి

దివాన్‌చెరువు, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ సిబ్బంది జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. దివాన్‌చెరువులోని గ్రామ సచివాలయం -2ను బుధవారం సందర్శించారు. సచివాలయం పరిధిలో శానిటేషన్ నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. ప్రజా సేవకు రాష్ట్రప్రభుత్వం మన మిత్ర యాప్ వాట్సప్ గవర్నెన్స్ తీసుకువచ్చిందని తెలిపారు. తొలిదశలో 161 పౌరసేవలు యాప్ ద్వారా అందజేయనున్నామన్నారు. సచివాలయం పరిధిలో ఉన్న అన్ని కుటుంబాలకు చెందిన వారి ఫోన్లలో ఈ నెంబరు ఫీడ్ చేయాలన్నారు. ఆమె వెంట ఇన్‌ఛార్జి డీఎల్‌పీవో పి.వీణాదేవి, రాజానగరం తహశీల్దార్ జీఎల్ఎస్ దేవి, ఎంపీడీవో జెపఝాన్సీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పక్కా.. కమర్షియల్!

ధవళేశ్వరంలో పంచాయతీ వద్ద ఒక భవనం



రెసిడెన్షియల్ మాటున కమర్షియల్ నిర్మాణాలు

- ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు
- అధికారుల మామూళ్ల మత్తు
- యథేచ్ఛగా సహకరిస్తున్న వైనం
- కళ్లెదుటే ఉన్నా కనిపించదు
- పెరుగుతున్న అక్రమ భవనాలు
- నిబంధనలు హుష్ కాకి
- నోటీసులతో సరి

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : అంతా మా ఇష్టం.. అడిగేదెవడురా అంతా మా ఇష్టం.. అనుకున్నారో ఏమో కానీ.. గత ప్రభుత్వ హయాంలో నిబంధనలు అతిక్రమించి బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టారు. అయినా అధికారులు నేటికీ చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. ప్రభుత్వం మారినా అధికారుల తీరు మారకపోవడంపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మామూళ్ల మత్తులో అక్రమ నిర్మాణాలకు కొమ్ముకాస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆక్రమించేసి.. కట్టేసి?

కాదేదీ ఆక్రమణలకు అనర్హం అన్నట్టు ఉంది పరిస్థితి. రోడ్లు, కాలువలు, ఇరిగేషన్ స్థలాలు, దేవాదాయ శాఖ, ఏసీఐఐసీ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా తూతూ మంత్రంగా నోటీసులిచ్చి చేతులు దు లుపుకుంటున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఒక పైపు జిల్లా కలెక్టర్.. మరో వైపు నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై చర్యలు చేపట్టాలంటూ ఆదేశాలు జారీచేసినా పంచాయతీ రాజ్ అధికారులు తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తుండడంతో అక్రమ నిర్మాణదారులకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. రాజమహేంద్రవరం రూరల్ మండల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో రెసిడెన్షియల్ నిర్మాణాలకు ప్లాన్ తీసుకొని కమర్షియల్ భవన నిర్మాణాలు చేపడుతున్నా అధికారుల మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంతో ప్రభుత్వానికి రావాల్సిన లక్షలాది రూపాయలు గండిపడుతుంది. ఈ తతంగంలో అధికారులు, కొంత మంది స్థానిక నాయకుల జేబులు నిండుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరువలో ఇలాంటి అక్రమాలు బోలెడు ఉన్నాయి. ధవళేశ్వరం పంచాయతీ ఎదురుగా రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని ఏకంగా ఫంక్షన్ హాల్ నిర్వహిస్తున్నారు. అదే గ్రామం కొత్తపేట ప్రాంతంలో నల్లా కాలువ ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపట్టినా నోటీసులిచ్చి చేతులు దులుపుకున్నారు. బొమ్మూరు పంచాయతీ పరిధి బాలాజీపేట సెంటరులో రెసిడెన్షియల్ అనుమతులు తీసుకుని సెమీ రెసిడెన్షియల్ భవన నిర్మాణం చేపట్టి ఒక బ్యాంక్‌కు అద్దెకు ఇచ్చారు. పిడింగొయ్యి పంచాయతీ పరిధి జగదీశ్వరీ లేఅవుట్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెనుక ప్రాంతంలో రెసిడెన్షియల్ అనుమతులు తీసుకుని కళ్యాణమండపం నిర్మించారు. హుకుంపేట పంచాయతీ రామకృష్ణ నగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఫ్లోర్‌ను కూల్చివేయాలంటూ లోకాయుక్త నుంచి ఆదేశాలు వచ్చినా అధికారులు మాత్రం భవన యజమానితో కుమ్మక్కై నాన్చుతున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే అక్రమ నిర్మాణాలు అటు రాజమహేంద్రవరం నగరం.. ఇటు రూరల్‌లో బోలెడు.. రూరల్ మండలం పరిధిలోని వెంకటనగరం,కాతేరు, కోలమూరు, శాటి లైట్ సిటీ, రాజవోలు, తదితర ప్రాంతాలతో పాటు రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో చాలా అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. దీనిపై పంచాయతీ కార్యదర్శులను ప్రశ్నిస్తే నోటీసులిచ్చాం మా పనైపోయిందన్నట్టు చెబుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి అక్రమ భవన నిర్మాణదారులపై చర్యలు చేపట్టాలని పలువురు మాజీ ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.



సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

బలభద్రపురంలో ఆరోగ్య సర్వే

బిక్కవోలు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బలభద్రపురం గ్రామంలో 8 బృందాలతో ఎన్‌సీడీ సీడీ 3.0 సర్వే నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌వో డా. కె.వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు.ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సర్వేలో భాగంగా 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి డేటాను నిక్షిప్తం చేస్తున్నట్టు తెలిపారు. ఆరోగ్య పరీక్షల్లో భాగంగా బీపీ, మధుమేహం, రక్తహీనత, రొమ్ము క్యాన్సర్, సర్వేకల్ క్యాన్సర్, నోటి క్యాన్సర్ పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు.క్యాన్సర్ సంబంధిత లక్షణాలు గుర్తిస్తే వెంటనే వారిని స్పెషలిస్ట్ డాక్టర్లకు రిఫర్ చేసి తగిన వైద్య పరీక్షలు చేయించి మందులు అందించడం జరుగుతుందన్నారు. గ్రామంలో ఉన్న పది వేల జనాభాను సర్వే చేస్తామన్నారు.

నిబంధనల ట్రాక్ తప్పారు!



రైలు కోచ్ రెస్టారెంట్

ప్రమాదాలు చెప్పిరావు.. ఏ క్షణానికి ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు.. ఎవరి జాగ్రత్తలో వాళ్లుండాల్సిందే.. లేదంటే ప్రమాదం తప్పదు.. రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషను ప్రాంగణంలోని రైల్ కోచ్ రెస్టారెంట్ నిబంధనల ట్రాక్ తప్పుతూనే ఉంది. అధికారులు అటుగా చూడకపోవడంతో ఉల్లంఘనలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. కాంట్రాక్టర్లకు వ్యాపారంపై ఉన్న యావ భద్రతపై ఉండడం లేదు. ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న వాటిపై కూడా అధికారులు పట్టించుకోవడంలేదు. రైల్ కోచ్ రెస్టారెంట్‌లో అగ్ని మాపక పరికరాలు లేవు. రైలు బోగీకి రంగులు వేసి, లోపల ప్లైవుడ్, కుషన్ సీట్లు ఏర్పాటు చేశారు. ఇవన్నీ అగ్గికి ఆజ్యం వంటివే. ఒక్కసారి నిప్పు రేగితే వేగంగా బుగ్గి అయిపోతాయి. పైగా తప్పించుకొనే (ఎస్కేపింగ్ వే) మార్గాలను సూచించలేదు. ఒక ఫైర్ ఎస్టింగిషర్ (మంటలు ఆర్పే గ్యాస్ ఉన్న చిన్న సిలిండర్)ని జనాలను ఏమార్చడానికి కోచ్ బయట పడేశారు. అది కూడా ఎప్పుడో కాలం చెల్లిపోయింది. రెస్టారెంట్‌లో వంటలకు గృహ వినియోగ సిలిండర్లను వాడుతున్నారు. ఇది చట్ట రీత్యా నేరం. పైగా దానిని వేడి నీటిలో పెట్టి మరీ వినియోగిస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. ఏదైనా ప్రమాదం జరిగితేనే కానీ పట్టదా సార్.. ఒకసారి అటు చూడండి మరి.. - రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి



రెస్టారెంట్ లోపల ఇలా..



గృహ సిలిండర్ వినియోగం



ప్రజావేదికలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న శేషారావు

గ్రామ, మండలస్థాయి కమిటీలు ఏర్పాటుచేయాలి

● నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు

ఉండ్రాజవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ, మండలస్థాయి కమిటీల ఏర్పాటుపై నాయకులు దృష్టిసారించాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు చెప్పారు. బుధవారం వేలివెన్నులో జరిగిన ప్రజావేదిక, టీడీపీ నియోజవర్గ విస్తృత్తస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థాగత కమిటీలు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు సమిష్టి కృషితో ఏర్పాటు చేయాలని తెలిపారు. పార్టీ సంక్షేమానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. అనంతరం ప్రజావేదికలో ప్రజల నుంచి గ్రామాల్లో సమస్యలపై మాజీ ఎమ్మెల్యే శేషారావు ఫిర్యాదులు స్వీకరించారు. పసలపూడి, కాల్దరి, సూర్యారావుపాలెం గ్రామాల పరిధిలో ఎర్రకాలువ ముంపు నివారణపై ఆ గ్రామాల రైతులు దరఖాస్తులు అందజేశారు. ముంపు నివారణచర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, నియోజవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నాయకులకు ప్రభుత్వంలో గుర్తింపు లేదు

కూటమి ప్రభుత్వంలో నియోజవర్గంలో టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు సముచితమైన స్థానంలేదని టీడీపీ విస్తృత్తస్థాయి సమావేశంలో పాల్గొన్న నిడదవోలు పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొమ్మ న వెంకటేశ్వరరావు, ఉండ్రాజవరం టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జి వెలిచేటి ప్రసాద్ పేర్కొన్నారు. వీరిద్దరు అన్న మాటలకు సమావేశంలోని పార్టీ మిగిలిన నాయకులు, కార్యకర్తలు ముక్తకంఠంతో మద్దతు పలికారు. గత పదినెలలుగా కూటమి ప్రభుత్వంలో పట్టణంలో నాయకులకు, కార్యకర్తలకు గుర్తింపులేదని వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. తాను టీడీపీ పట్టణ అధ్యక్ష పదవి నుంచి తప్పుకునేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి ప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌ఛార్జికి, నాయకులకు తగిన గుర్తింపు లేకపోవడంతో కేడర్ ఆవేదన చెందుతున్నట్లు తెలిపారు. తాను బాధ్యతల నుంచి తప్పుకుంటానని చెప్పారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ పార్టీ కన్న తల్లిలాంటిదన్నారు. పదవి ఉన్నా లేకున్నా పార్టీకి అభివృద్ధికి, సంక్షేమానికి పనిచేయాలని సూచించారు. పార్టీ అధినేతల మాటలను, కూటమి ధర్మాన్ని పాటించాలని సముదాయించారు.

తిరుపతి శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి



తిరుపతిలో వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, టీడీపీ నాయకులు

గోపాలపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో వెనుకబడిన గోపాలపురం నియోజకవర్గాన్ని కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చెందేలా చూడాలని కలియుగ దైవం శ్రీవెంకటేశ్వరస్వామి దర్శనం అనంతరం కోరుకున్నట్లు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు. తిరుపతి, చిత్తూరు, తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగే అసెంబ్లీ అంచనాల కమిటీ సమీక్షా సమావేశానికి హాజరైన ఆయన అనంతరం బుధవారం శ్రీవెంకటేశ్వరస్వామిని దర్శించు కున్నారు. మూడురోజులపాటు జరిగే సమీక్షా సమావేశాల్లో ఆయన పాల్గొంటున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలను ఓదార్చిన ఎంపీ పురందేశ్వరి



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎంపీ పురందేశ్వరి, కొవ్వూరు ఆర్డీవో రాణీ సుస్మిత

నిడదవోలు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గోదావరిలో ప్రమాదవశాత్తూ ఇద్దరు యువకులు దుర్మరణం చెందడం బాధాకరమని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బుధవారం సాయంత్రం నిడదవోలు చర్చిపేటలో మృతి చెందిన యువకుల కుటుంబాలను ఆమె పరామర్శించారు. ప్రభుత్వపరంగా కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. ఆమె వెంట కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, బీజేపీ నాయకులు రంగా వెంకటేశ్వరరావు, నీలం రామారావు ఉన్నారు.

‘దేశం గర్వించదగ్గ నాయకుడు అంబేడ్కర్’

కొవ్వూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : అంటరానితనం, కుల నిర్మూలనకు అంబేడ్కర్ చేసిన సేవలు ఎనలేనివని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర నాయకుడు బొంతా శ్యాంరవిప్రకాష్ అన్నారు. బుధవారం కొవ్వూరు పట్టణం మెరకవీధిలోని అంబేడ్కర్ విగ్రహానికి చెల్లే శేఖర్‌రావు పూలమాలవేసి నివాళులర్పించారు. అంబే డ్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని క్రిస్టియన్‌పేట అంబేడ్కర్ యూత్, జై భీమ్ యూత్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సుమారు 1000 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాసా ఆనంద్, పులిదిండి సుబ్బారావు, బొంతా కిషోర్, వెంకటరావు, ఎస్.సురేంద్ర, పి.చిన్నా, కె.సూరిబాబు, ఎం.రామకృష్ణ, మున్నా, భాస్కర్, లక్ష్మణ్, శేఖర్, నాగేశ్వరరావు, రాజేంద్ర, చైతన్య, శ్రీనివాస్, బంగార్రాజు పాల్గొన్నారు.



మెరకవీధిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

● ఐటీఆర్‌పీ ప్రకృతి వ్యవసాయశాఖ అధికారి పద్మావతి



దేవరపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

దేవరపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి):ప్రకృతి వ్యవసాయంతో భూసారాన్ని పెంపొందించుకోవడంతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చని ఐటీఆర్‌పీ ప్రకృతి వ్యవసాయశాఖ అధికారి పద్మావతి పేర్కొన్నారు. ఖరీఫ్ యాక్షన్‌ప్లాన్ 2025లో భాగంగా ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీ బుధవారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ శాఖాధికారి పద్మావతి మాట్లాడుతూ వ్యవ సాయ భూసారాన్ని పెంపొందించుకు నేందుకు నవధాన్యాలు చల్లుకుని వాటిని 40రోజుల త రువాత కలియదున్నితే భూసారం పెరుగుతు ందన్నారు. దీనివలన దిగుబడులు సాధించవ చ్చన్నారు. ఈ నవధాన్యాలు సాగుచేయడంవలన భూమిలో సూక్ష్మజీవులు పెరిగి భూసారం పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయశాఖ అధికారులు, శ్రీనివాస్, ప్రసన్న, సురేఖ, రాధ, రత్నం, భవాని, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

నల్లజర్ల: సేంద్రియ వ్యవసాయంవల్ల సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయం మాస్టార్ ట్రైనర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం శింగరాజుపాలెం గ్రామంలో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ భూమి సారం పెరగాలన్నా, స్వచ్ఛమైన పంటలు పండించాలన్నా రైతులు రసాయన, క్రిమిసంహారక మందులు వాడకాన్ని తగ్గించాలన్నారు. ప్రకృతి సహజ సిద్ధమైన పచ్చిరొట్ట ఎరువులు వాడడంతోపాటు పంటలకు వేపపిండి వంటివి అందించడం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులను సాధించవచ్చునన్నారు. మందులతో పండించిన పంటలను తినడంవల్ల ఆరోగ్యానికి హానికరమన్నారు. చిరు ధాన్యాలవల్ల ఆయుస్కాలం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మారం కనక దుర్గ, వెంకటేష్ పాల్గొన్నారు.

గోపాలపురం: నవధాన్యాల సాగుతో భూమి సారవంతంగా మారుతుందని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ అన్నారు. వెంకటాయపాలెంలో 2025 యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామసభ ఏర్పాటుచేసి నవధాన్యాల ఉపయోగాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో అత్యంత ఆసక్తి కనబరుస్తున్న వీరమళ్ల శ్రీనివాస్ కాండ్రేగుల సూర్యారావు, మిద్దే చల్లారావులను ఘనంగా సత్కరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీనివాస్, యూనిట్ ఇన్‌ఛార్జ్ దుర్గాదేవి, వెంకటలక్ష్మి, దుర్గా, నాగలక్ష్మి, వీఏఏ వీరమళ్ల ఝాన్సీ, సర్పంచ్ సత్తిబాబు,రాజేంద్ర పాల్గొన్నారు.

‘లోక్ అదాలత్‌లో కేసుల రాజీకి సహకరించాలి’

కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి అనురాధ



కొవ్వూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్ కంపెనీ న్యాయవాదులు లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కోర్టుకు సహకరించాలని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ సూచించారు. బుధవారం కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీ న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. న్యాయవాదులు కోర్టులకు సహకరించాలని జిల్లా జడ్జి అనురాధ అన్నారు.

ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కోవడానికి యాక్షన్‌ప్లాన్ తయారీపై శిక్షణ

● తహసీల్దార్ దుర్గాప్రసాద్



డిజాస్టర్ మేనేజ్‌మెంటు శిక్షణలో పాల్గొన్న మండలస్థాయి అధికారులు

కొవ్వూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి ప్రభుత్వ శాఖల అధికారులు శాఖల వారీగా యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మె ంటు అథారిటీ ఆధ్వర్యంలో మండలస్థాయి అధికారులకు 2వ రోజు శిక్షణ అందజేశారు. ఏతఈఈ బి.చిన్నంరాజు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్టాలను ఎలా అధిగమించాలి, తగ్గించడానికి, నివారించడానికి శాఖలవారీగా యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేసుకోవాలి, నష్టాల అంచనా తయారు చేయడం, యాక్షన్‌ప్లాన్ ఎలా తయారుచేసుకోవాలో వివరించారు. నష్టాల అంచనా తయారు చేయడం, ముందు వేసవిలో ఉరుములు, మెరుపులతో కూడిన గాలులు, వర్షాలు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఫైర్ అధికారి ఏ.వి.ఎస్ఎన్.ఎస్ వేణు, ఈవోపీఆర్‌ఆర్‌డీ బి.ప్రకాశరావు, కృష్ణవేణి, కె.ఆర్.కిషోర్, ఎ.గంగాధర్, టి.మణిరామ్, జి.మణికంటరాజు, వి.సతీష్, డి.జగదీశ్వరరావు, బి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

రీ సర్వేపై అవగాహన ర్యాలీ



వడ్లూరులో రీసర్వేపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గోపాలపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన రీ సర్వేకు రైతులు సహకరించాలని కొవ్వూరు ఆర్డీవో కె.రాణిసుస్మిత అన్నారు. మండలంలోని నందిగూడెం గ్రామంలో రీ సర్వేపై అవగాహన ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు రీసర్వే జరిగే సమయంలో ముందుస్తు సమాచారం ఇవ్వాలన్నారు. సరిహద్దుల్లో ఉన్న రైతులను తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. అనంతరం తహసీల్దార్ అజయ్‌బాబు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు.

లోపాలు లేకుండా సర్వే చేయాలి

ఉండ్రాజవరం: భూముల రీసర్వే లోపాలు లేకుండా చేయాలని తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం వడ్లూరు గ్రామంలో రీ సర్వేపై గ్రామసభ, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి రైతులు తమ పొలానికి సంబంధించి హద్దులను ఖచ్చితంగా ఈ సర్వే ద్వారా నిర్ధారిస్తామని ఆయన వివరించారు. రైతులు సర్వేకు సహకరించాలని తహసీల్దార్ ప్రసాద్ కోరారు. సర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రామాలయానికి వాటర్‌కూలర్ బహూకరణ



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్

కొవ్వూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ముక్కచింతల రామాలయానికి దాత గుడపాటి శ్రీహరి సత్యనారాయణ ఆర్థిక సహకారంతో వాటర్‌కూలర్ అందించారు. వేసవిలోనే కాకుండా ఏడాది పొడవునా ప్రజల దాహార్తిని తీర్చడానికి ఆలయకమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ ప్రారంభించారు. ఆలయకమిటీ చైర్మన్ పాలెంపాటి చిన్నబాబు మాట్లాడు తూ దాత గూడపాటి శ్రీహరి ఆర్థిక సహకారంతో ప్రజలకు 365 రోజులు తాగునీరు అందించడానికి వాటర్‌కూలర్ బహూకరించారన్నారు. ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గూడపాటి శ్రీహరి, జి.బొజ్జయ్య, కంటమణి నరసింహమూర్తి, వెంకటేశ్వరరావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

24న కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కొవ్వూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డుని పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు మద్దుకూరి దొరయ్య తెలిపారు. ఏప్రిల్ 24వ తేదీన కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంవద్ద ఏపీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుందరబాబు మాట్లాడుతూ గతంలో మంజూరై పెండింగ్‌లో ఉంచిన క్లైయిమ్‌లకు నిధులు వెంటనే చెల్లించాలన్నారు. నిర్మాణ కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. సెస్ నిధులను కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలన్నారు. గత ప్రభుత్వాలు అక్రమంగా తీసుకున్న వెల్ఫేర్ బోర్డు నిధులను తిరిగి చెల్లించాలన్నారు. నిర్మాణ కార్మికులకు గృహ నిర్మాణాలకు వెల్ఫేర్ బోర్డు ద్వారా సబ్సీడీతో కూడిన రుణాలను అందించాలన్నారు. కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలన్నారు. 24వ తేదీన జరిగే ధర్నాకు పెద్ద సంఖ్యలో కార్మికులు హాజరుకావాలన్నారు.

దివ్యాంగ ఆశ్రమానికి రూ.లక్ష విరాళం



దాత రామకుమారిని సత్కరిస్తున్న కాగిత భాస్కరరావు

దేవరపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లగూడెంలోగల భారతి వృద్ధ, దివ్యాంగుల ఆశ్రమానికి హైదరాబాద్‌కు చెందిన బొల్లిన రామకుమారి రూ.లక్ష విరాళం ఆశ్రం చైర్మన్ కాగిత భాస్కరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా కాగిత భాస్కరరావు మాట్లాడుతూ బొల్లిన రామకుమారి 1980లో తనతోపాటు 10వ తరగతి చదువుకు న్నారని తెలిపారు. తన తండ్రి నున్నా రామారావు జ్ఞాపకార్థం వృద్ధాశ్రమ గదినిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేసిందన ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దాత రామకుమారిని సత్కరించారు.

గజ్జరంలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

తాళ్లపూడి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గజ్జరం గ్రామంలో బుధవారం ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిచాలనే దృక్పథంతో మడిచర్ల శ్రీనివాసరావు (ఎంఎస్) అనే యువకుడు నేచురల్ మినరల్ వాటర్ ప్లాంటును ప్రాంభించారు. ఆయన తన తండ్రి మరిచర్ల వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం ఈవాటర్ ప్లాంటును ప్రారంభించానని ఇక్కడ పరిసర ప్రాంతాలలో మరెక్కడా లేని విధంగా ప్రజా ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని వాటర్ ప్లాంటును నిర్మిస్తామన్నారు. ఈ నేచురల్ మినరల్ వాటర్ ట్యాంకును ప్రత్యేక తరహాలో ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో నిర్మించారన్నారు. ఈ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి తీర్మానం చేసిన పంచాయతీ పాలకవర్గానికి, నీటిపారుదల శాఖ ఏతఈ సూర్జహాన్‌కి సంబంధిత అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామ సర్పంచ్ గండి రాంబాబు మాట్లాడుతూ తాను ఇక్కడి సమస్యను తెలిపిన వెంటనే వాటర్ ప్లాంటు ను నిర్మించిన మడిచర్ల శ్రీనివాసరావు (ఎంఎస్)ను అభినందించారు. ఈ ప్లాంట్‌ను నిర్మించిన దాత ఎం ఎస్‌కు స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

హైస్కూల్‌కి వాటర్ ప్లాంట్ బహూకరణ

నల్లజర్ల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) నల్లజర్ల మండలం పోతవరం హైస్కూల్‌లో 1981-82లో 10వ తరగతి చదివిన పూర్వవిద్యార్థులు తమ స్కూల్‌కి తమవంతు సాయంగా విద్యార్థులు మినరల్ వాటర్ తాగేందుకు 2లక్షల 50 వేలతో వాటర్‌ప్లాంట్‌ను బహూకరించారు. బుధవారం పూర్వ విద్యార్థులు అబ్బూరి పట్టియ్య, ప్రత్తిపాటి కృష్ణ, బలుసు పురుషోత్తం ఆధ్వర్యంలో స్కూల్ హెచ్ఎం గోపి గోవర్ధన్‌కు వాటర్ ప్లాంట్‌ను అప్పగించారు.

అగ్నిప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు పాటించాలి

● అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అవగాహన కార్యక్రమాలు





కొవ్వూరు, నిడదవోలులో గ్యాస్ సిలిండర్ ప్రమాదాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారులు

నిడదవోలు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వేసవిలో వంటింట్లో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా మహిళలు చిన్నచిన్న జాగ్రత్తలు పాటించాలని జిల్లా సహాయ అగ్నిమాపకశాఖ అధికారి కె.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని గాంధీ నగర్‌లోగల ధరణి అపార్టుమెంటులో అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అపార్టుమెంటువాసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రికల్, గ్యాస్ అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో వృద్ధులను చిన్నారులను ఖాళీ ప్రదేశాలకు తరలించాలని అన్నారు. అనంతరం అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన సూచనలు ఉన్న కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ ప్రమాదాలపై మహిళలకు అవగాహన

కొవ్వూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ ప్రమాదాలపై మహిళలకు అవగాహన ఉండాలని ఫైర్ అధికారి ఏ.వి.ఎస్.ఎన్.ఎస్.వేణు అన్నారు. బుధవారం కొవ్వూరు పట్టణంలోని గౌతమీనగర్ పో స్టాఫీసు రోడ్‌లోని శ్రీ సూర్యటవర్స్ అపార్ట్‌మెంట్లలో మహిళలకు గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వ్యాప్తి చెందినప్పుడు, విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ అయ్యి ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవ గాహన కల్పించారు. మంటలను ఏవిధంగా ఆర్పాలి అని ప్రదర్శనల ద్వారా చేసి చూపించారు. అపార్టుమెంట్లలో తప్పనిసరిగా అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు

గోపాలపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): దొండపూడి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సంజీవని వలంటరీ బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో 501మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు, హెల్పింగ్‌హ్యాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థిని రాపాక భవానీని లాప్‌టాప్ ఇచ్చి అభినందిస్తున్న రాష్ట్ర మంత్రి నారా లోకేశ్

రాపాక భవానికి మంత్రి లోకేశ్ అభినందనలు

నిడదవోలు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సీఈసీ ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షలలో విద్యార్థిని రాపాక భవాని 1000/974 మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచిన సందర్భంగా మంగళవారం మంగళగిరిలోని ఉండవల్లిలో మంత్రి నారా లోకేశ్ లాప్‌టాప్ అందించి విద్యార్థిని రాపాక భవానిని అభినందించినట్లు కళాశాల ప్రిన్సిపల్ బి.గీతాంజలి తెలిపారు. బుధవారం నిడదవోలు కళాశాలలో అధ్యాపక బృందం భవానిని అభినందించారు.

కొవ్వూరు ఏఎంసీ చైర్మన్‌గా నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి



చాగల్లు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): చాగ ల్లుకు చెందిన నాదెళ్ల శ్రీరామ్ చౌదరిని కొవ్వూరు ఏఎంసీ చైర్మన్ పదవి వరించింది. తీవ్రమైన పోటీని తట్టుకొని ఆయన ఏఎంసీ చైర్మన్ పదవిని దక్కించుకోవడం విశేషం. గత 15 సంవత్సరాలకు పైగా ఆయన టీడీపీలో ఉత్సాహంగా పని చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఆయన జిల్లా తెలుగుయువత కోసం తీవ్రంగా పోటీపడ్డారు. అప్పటి నుంచి ఆయన పదవుల కోసం కాకుండా పార్టీ కోసం నిరంతరం కష్టపడి పనిచేస్తున్నారు. యువగళం టీంలో ఉత్సాహంగా పనిచేసి నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా చురుగ్గా పాల్గొన్నారు. ప్రస్తుతం మండలపార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఏఎంసీ చైర్మన్‌గా ఆయన పేరు ప్రకటించిన సందర్భంగా ఆయన అభిమానులు చాగల్లులో బాణాసంచా పేల్చి సంతోషం వ్యక్తం చేశారు.

నేటి నుంచి త్యాగరాజ ఆరాధన

కొవ్వూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గోవూరు సద్గురు శ్రీ త్యాగరాజ సామగాన ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈనెల 17, 18, 19 తేదీలలో శ్రీ పెండ్యాల వెంకట్రాయుడు మెమోరియల్ ఫ్యాక్టరీక్లబ్ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షురాలు అనుపిండి జయలక్ష్మి తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6-30 నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. 17నత్యాగరాజ ఆరాధన, పంచరత్నగాన సేవ, అయ్యగారి సత్యప్రసాద్ వీణావాదన, 18న విష్ణుబొట్ల సరస్వతి, విష్ణుబొట్ల కృష్ణవేణిల ఆధ్వర్యంలో గాత్రయుళం, 19న డి.వి.మోహనకృష్ణచే గాత్ర కచేరి ఏర్పాటు చేశారు. సంగీత ప్రి యులందరూ హాజరుకావాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొవ్వూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయాలై చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు కొవ్వూరు పట్టణ ఏఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని తోగుమ్మి గ్రామానికి చెందిన వాడపల్లి సత్యనారాయణ (43)ని ఈనెల 11వ తేదీన రోడ్డుకం రైలు బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని వాహ నం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయాలైన సత్యనారాయణను కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. మంగళవారంరాత్రి 12గంటల సమయంలో చికిత్స పొందుతూ సత్యనారాయణ మృతి చెందాడు. మృతుడి సోదరుడు వాడపల్లి రాంబాబు ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసినట్లు ఏఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు

దేవరపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు దేవరపల్లి పావని ఎంటర్‌ప్రైజర్ యాజమాని, టీడీపీ నాయకులు బళ్లా సూర్యచక్రం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బళ్లా సూర్యచక్రం మాట్లాడుతూ వేసవిలో ప్రతీ ఏడాది బాటసారులకు, ప్రయాణికులకు చల్లటి తాగునీరు, మజ్జిగ, ప్రతీరోజు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటలవరకు ఈ చలివేంద్రలో నీరు అందిస్తామన్నారు.